# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ ఆదివారం | 19 జనవరి 2025 | ■ 13 పేజీలు


## సిర్పూర్(టి)రేంజ్ పరిధిలో బర్డ్ వాక్-3

వివరాలు 13లో

అటవీశాఖ ఆధ్వర్యంలో పెంచికలపేట రేంజ్‌లో నిర్వహించిన బర్డ్‌వాక్ ఫెస్టివల్-3లో పాల్గొనేందుకు 30మంది ఔత్సాహిక పక్షిప్రేమికులు శుక్రవారం సాయంత్రం పెంచికల్‌పేటకు చేరుకున్నారు. రాత్రి ఇక్కడే బసచేశారు. శనివారం ఉదయం సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, ఎఫ్‌డీవో బోబడే సుశాంత్ సుకుదేవ్‌తో కలిసి బర్డ్‌వాక్ ఫెస్టివల్-3ను ప్రారంభించారు.





5లో

# 'పది'కి పక్కా ప్రణాళిక

## హ్యాట్రిక్ కోసం డీఈఓ పకడ్బందీ ప్రణాళిక

■ టెన్త్ ఫలితాలపై ప్రత్యేక శ్రద్ధ ■ టెన్త్‌లో జిల్లా రికార్డు పదిలం కోసం పరుగులు

■ 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కార్యాచరణ ■ పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్న నిర్మల్ డీఈఓ

నిర్మల్ జిల్లా డీఈఓ దృష్టంతా 10 ఫలితాలపైనే.. డీఈఓగా బాధ్యత చేపట్టిన నాటి నుంచి పి. రామారావు గొప్ప టార్గెట్‌ను నిర్ణయించుకొని దాని సాధనలో రాత్రింబవళ్లు పర్యటనలు చేస్తూ జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులను దిశానిర్దేశం చేస్తున్నారు. ఎక్కడికి వెళ్లినా ఇదివరకు ఉన్న 10 ఫలితాల రికార్డును నిలబెట్టి ఈ సారి హ్యాట్రిక్‌ను సాధించాలని సూచిస్తున్నారు. ప్రత్యేక ప్రణాళిక రూపొందించింది. విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించేలా ఉపాధ్యాయులతో సమన్వయం చేసుకుంటూ.. విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా నైపుణ్యాన్ని పెంచి ఉత్తీర్ణత శాతాన్ని పెంచే లక్ష్యంతో ముందుకెళ్తున్నారు. ఉత్తమ ఫలితాలతో పాటు అత్యధిక మార్కులు సాధించేలా తరగతులు బోధించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. వెనుకబడ్డ విద్యార్థులపై శ్రద్ధపెట్టి పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయిస్తున్నారు. ఆయా సబ్జెక్టులపై విద్యార్థులకున్న సందేహాలను నివృత్తి చేస్తూ సబ్జెక్టులపై అవగాహన పెంపొందించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ సబ్జెక్టుపై విషయ నిపుణుల ఆధ్వర్యంలో వెనుకబడిన విద్యార్థులకు అవగతమయ్యే విధంగా సరళమైన విధానంలో బోధించాలని సూచిస్తున్నారు.

## మర్మవయవాలపై.. కొట్టి చంపేశారు

■ నిర్మల్ రూరల్ మండలం చిట్యాల గ్రామంలో దారుణం

■ 12 ఏళ్ల బాలుడి హత్య ■ ఘటనపై ఎస్పీ సీరియస్..

■ కన్నీటి పర్యంతమైన తల్లి ■ ఘటనా స్థలం పరిశీలన

■ ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ం, డాగ్ స్క్వాడ్ టీం



10లో

నిర్మల్ రూరల్ మండలం చిట్యాల గ్రామానికి చెందిన అడిగెల రిషి అలియాస్ ప్రశాంత్ (12) కల్లు బట్టీలో పనిచేస్తున్నాడు. రోజులాగానే శుక్రవారం పనికి వెళ్లాడు. రాత్రి పొద్దుపోయే వరకు అక్కడే పనిచేశాడు. రాత్రి ఇంటికి రాలేదు. శనివారం తెల్లవారుజామున రిషి గ్రామ శివారులో హత్యకు గురయ్యాడని తెలిసి ఆ తల్లి గుండెలు బాదుకుంటూ ఘటనస్థలికి చేరుకుంది. విషయం తెలుసుకున్న ఎస్పీ జానకీ షర్మిల ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాలుడి మర్మాంగాలపై బండరాళ్లతో కొట్టినట్లు ఆనవాళ్లు ఉన్నాయి.

## బ్యాంకర్ల వేధింపులకు రైతు బలి!

తీసుకున్న అప్పు తిరిగి చెల్లించాలని బ్యాంకు అధికారుల వేధింపులు భరించలేక ఓ రైతు బ్యాంకులోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో జరిగింది. బేల మండలం రేణుగూడకు చెందిన రైతు జాదవ్ దేవరావ్ జిల్లా కేంద్రంలోని ఐసీఐసీఐ బ్యాంకులో రూ.3లక్షలు అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లించాలని అధికారులు వేధిస్తున్నారని బ్యాంకుకు వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడని రైతు కుటుంబ సభ్యులు తెలిపారు.





## మంచిర్యాల.. ఇక కార్పొరేషన్

13లో

■ అసెంబ్లీ సమావేశాల్లో చేసిన తీర్మానానికి రాష్ట్ర గవర్నర్ ఆమోదం

■ గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వ కార్యదర్శి ఆర్. తిరుపతి

■ మంచిర్యాల మున్సిపాలిటీ, పలు గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనం..

■ నెలాఖరుతో ముగియనున్న మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీకాలం

■ గ్రామాల్లో ముగిసిన సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల పదవీకాలం

■ కార్యాచరణ రూపొందిస్తున్న సంబంధిత శాఖ అధికారులు

## ప్రశాంతంగా 'నవోదయ' పరీక్ష

జిల్లాలో నిర్వహించిన జవహర్ నవోదయ కేంద్రీయ విద్యాలయాల్లో 6వ తరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష శనివారం ఉమ్మడి జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది.



వివరాలు 13లో

## తెలంగాణ మావోయిస్ట్ పార్టీ సెక్రటరీ దామోదర్ మృతి



■ అంచెలంచెలుగా ఎదిగిన చొక్కారావుకు జిల్లాలో పట్టు

■ జిల్లాలో కార్యాలపాలను విస్తరించేందుకు అనేక ప్రయత్నాలు చేసిన బడే -6లో



### ఆధ్యాత్మికతపై దృష్టి సారిస్తే

# మానసిక ప్రశాంతత

**ఆదిలాబాద్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

ఆస్తులు, డబ్బు, అధికారంతో దొరకని మానసిక ప్రశాంతత ఒక్క రోజు అలా చేస్తే లభిస్తుందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శనివారం ఆదిలాబాద్ పట్టణంలోని ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన స్మృతిదినం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారి వ్యవస్థాపకుడు బ్రహ్మ బాబా చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నిత్యం ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ జనం మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారని అన్నారు. అటువంటివారు వారంలో ఒక్క రోజైనా ఆధ్యాత్మికతపై దృష్టి సారిస్తే ఎంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీకే రేవతి, పలువురు బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

### ఒక సీసీ కెమెరా వంద మంది

# పోలీసులతో సమానం

### జన్నారం ఎస్సై గుండేటి రాజ వర్ధన్



**జన్నారం, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని ప్రతి గ్రామంలో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని జన్నారం ఎస్సై గుండేటి రాజ వర్ధన్ అన్నారు. శనివారం మండలంలోని తపాలాపూర్ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో సిసి కెమెరాలు ఏర్పాటుకు సహకరించాలన్నారు. దొంగతనాలు జరగకుండా నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు. మాజీ సర్పంచ్ నైనాల తిరుపతి, పీఏసీఎస్ వైస్ ఛైర్మన్ విజయ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ

**జన్నారం, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకమండలి సభ్యులు ఈవీ శ్రీనివాస్ జన్మదినాన్ని పురస్కరించుకొని శనివారం జన్నారం మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రంలో రెడ్ క్రాస్ సొసైటీ మెంబర్ మేకల అక్షయ్ కుమార్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు మరియు బ్రెడ్డు ప్యాకెట్లు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ రెడ్ సొసైటీ ద్వారా ఎంతో మందికి రక్తాన్ని అందించామన్నారు. కార్యక్రమంలో జన్నారం మండల మాల మహానాడు సెక్రెటరీ కోడి హరీష్, ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ లక్ష్మీ, సిబ్బంది క్రిష్ణవేణి, విజయలక్ష్మి, రాధిక తదితరులతో పాటు రోగుల సహాయకులు పాల్గొన్నారు.



# 20లోగా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేయాలి







### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల ద్వారా అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా అధికారులు క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్న క్షేత్ర స్థాయి పరిశీలన ప్రక్రియను జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పరిశీలించారు. శనివారం కుంటాల మండలం లింబా (కే) గ్రామంలో సర్వే బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన జరుపుతున్న తీరును తనిఖీ చేశారు. వివిధ సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం అర్హులను గుర్తించేందుకు అవలంభిస్తున్న విధానాలను, సర్వే బృందాలు సేకరిస్తున్న వివరాలను కలెక్టర్ పరిశీలించారు. గ్రామ శివారులోని ఆయా సర్వే నంబర్లలో గల రైతులకు సంబంధించిన పట్టా భూములను, అసైన్డ్ స్థలాలను వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన సందర్భంగా సేకరించిన వివరాలను రిజిస్టర్లలో స్పష్టంగా నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. త్వరితగతిన ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని, తప్పిదాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల జాబితా రూపొందించాలని అధికారులను ఆమె ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలలో క్షేత్ర స్థాయి పరిశీలన కొనసాగుతోందని తెలిపారు. ముఖ్యంగా రైతు భరోసా పథకం ద్వారా అర్హులైన ప్రతి రైతుకు లబ్ది చేకూర్చేందుకు వీలుగా సాగుకు యోగ్యమైన భూములను సర్వే నెంబర్ల వారీగా క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా నిర్ధారించడం జరుగుతోందన్నారు. అదేవిధంగా ఆహార భద్రతా కార్డులను అర్హత కలిగిన కుటుంబాలకు అందించేందుకు వీలుగా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా అధికార బృందాలు క్షేత్ర స్థాయి పరిశీలన జరుపుతున్నాయని తెలిపారు. ఈ నెల 20వ తేదీ నాటికి ఆయా పథకాల కింద అర్హులైన వారి జాబితాలను రూపొందించి, 21 నుండి 24వ తేదీ వరకు ఎంపీడీఓలు, తహసీల్దార్లు, మండల స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణలో నిర్వహించనున్న గ్రామ సభలలో వాటిని ప్రవేశపెట్టి చదివి వినిపించడం జరుగుతుందన్నారు. గ్రామ సభ ఆమోదం మేరకు లబ్ధిదారుల వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేస్తామన్నారు. ఈ నెల 26 వ తేదీన ప్రభుత్వం రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత (రేషన్ కార్డులు), ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల అమలుకు శ్రీకారం చుట్టి లబ్ధిదారులకు ప్రయోజనం చేకూర్చనుందని కలెక్టర్ తెలిపారు. అంతకుముందు కుంటాల మండల కేంద్రంలోని పశు వైద్య శాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆసుపత్రి పరిసరాలను ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచాలని, పచ్చదనం పెంపొందేలా విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. ఆస్పత్రిలోని అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్ రిజిస్టర్లను పరిశీలించి వైద్యులకు పలు సూచనలు చేశారు. డ్రగ్స్ స్టో రూమ్‌ని పరిశీలించి గడువు తీరిన మందులను వెంటనే తీసివేయాలని రికార్డులలో పక్కాగా నమోదు చేయాలని సూచించారు. అనంతరం పౌర సేవా కేంద్రం, మండల గ్రంథాలయాన్ని పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో బైంసా ఆర్డీఓ కోమల్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. రాజేందర్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, డి ఎస్ ఓ కిరణ్ కుమార్, తహసీల్దార్ అజీజ్ ఉన్నారు.

### ఓటు లాంటిది ఇంకొకటి లేదు

# నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను



### ఎన్నికల అధికారి, మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

ఈ నెల 25వ తేదీన 15వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో ఓటరు దినోత్సవ వేడుకలను అన్ని శాఖల సమన్వయంతో ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. 15వ జాతీయ ఓటరు దినోత్సవంలో "ఓటు లాంటిది ఇంకొకటి లేదు నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను" అనే నినాదంతో అర్హత గల ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునే విధంగా వివిధ రకాల కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరచడం జరుగుతుందని తెలిపారు. ఓటరు దినోత్సవ సంబంధిత పోస్టర్లు, బ్యానర్లు, ప్రసార మాధ్యమాలు, ప్రచార కార్యక్రమాల ద్వారా జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారుల పరిధిలో విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని, జిల్లాలో ఆడియో, వీడియో సందేశాల ద్వారా ఎన్నికలలో తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఓటరు దినోత్సవ నినాదాన్ని ప్రతిబింబించేలా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్ జెండర్లను ఓటు వేసేలా ప్రోత్సహిస్తూ వారిని స్ఫూర్తిదాయంగా చూపించడం జరుగుతుందని, బ్యాంకులు, పోస్టాఫీసులు, రైల్వే, పంచాయతీరాజ్ ఇతరత్రా శాఖల సమన్వయంతో, కార్పొరేట్ సంస్థలు, సొసైటీల ఆధ్వర్యంలో వ్యాసరచన, ఉపన్యాసం, వెబినార్, సెమినార్ల ద్వారా ప్రజలందరికీ తెలిసేలా ఓటు ఆవశ్యకతను వివరించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ శాఖలు వారి కార్యాలయంలో ఓటరు ప్రతిజ్ఞ చేసి సంబంధిత సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేపట్టాలని తెలిపారు. నూతనంగా నమోదు కాబడిన ఓటర్లను గుర్తించి వారిని సన్మానించి, ఓటరు గుర్తింపు కార్డులను అందించడం జరుగుతుందని, ప్రాంతీయ భాషలో ఈ.వి.ఎం., వి.వి. ప్యాట్, పోస్టల్ బ్యాలెట్, పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు, హెల్ప్ లైన్ యాప్, ఓటు విలువ తదితర అంశాలపై ప్రజలకు అర్థమయ్యే రీతిలో వీడియోలు రూపొందించి ప్రదర్శించడం జరుగుతుందని, దినపత్రికలు, ఛానళ్ళు, హోర్డింగుల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 25వ తేదీన నిర్వహించనున్న జాతీయ ఓటరు దినోత్సవాన్ని విజయ వంతం చేసేందుకు కలిసి రావాలన్నారు.

### ఆదిలాబాద్‌లో

# సోమవారం ప్రజావాణి రద్దు

**ఆదిలాబాద్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**



ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి వచ్చే సోమవారం ఈ 20వ తేదీన ప్రజావాణి ని రద్దు చేయడం జరిగిందని కలెక్టర్ రాజర్షి షా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభు త్వం ప్రతిష్మాత్మకంగా 26న అమలు చేయనున్న నాలుగు పథకాలపై సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో ఫీల్డ్ వెరిఫికేషన్ చేపడుతున్న సందర్భంగా వచ్చే సోమవారం ప్రజవాణిని రద్దు చేయడం జరిగిందని పేర్కొన్నారు. ప్రజలు, అర్జీదారులు దీనిని గమనించాలన్నారు.

# ముమ్మరంగా రైతు భరోసా సర్వే

**తలమడుగు, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

మండల వ్యాప్తంగా రైతు భరోసా పథకం అమలు చేసేందుకు ప్రభుత్వ వ్యవసాయ రెవెన్యూ అధికారులు గ్రామ గ్రామాల్లో తిరుగుతూ సర్వేను మొదలు పెట్టారు. శనివారం తలమడుగు మండలంలోని దహెగాం, కొత్తూరు, తలమడుగు, తదితర గ్రామాల్లో ఆయా అధికారులు ప్రతి దానిని తనిఖీ చేస్తూ రైతు భరోసాకు అనుకూలమైన భూములు, కానీ భూములను క్షుణ్ణంగా పరిశీలిస్తూ ముందుకు వెళ్తున్నారు. రైతు భరోసా మీద ఆశలు పెట్టుకున్న రైతులు అధికారుల మీద ఎగబడి మా పేర్లు రాయండి అంటున్నారు. పేర్లు లేకుంటే రైతు భరోసా రాదేమో అన్న భయంతో పొలం పనులు వదలి మరి తమ పేర్ల నమోదు కోసం సర్వే కోసం వేచి చూస్తున్నారు. అలాగే రైతు భరోసా కోసం కొత్తగా వచ్చే దరఖాస్తులను కూడా స్వీకరిస్తు వారి వివరాలు సర్వే చేస్తున్నాం అని జనవరి 20 వ తేదీ లోపల సర్వేను పూర్తి చేసే విధంగా ముందుకు వెళ్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు పౌర్ణిమ సాయి, రైతులు పాల్గొన్నారు.








# అర్హత గల ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

## రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**మంచిర్యాల, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రంలో అర్హత గల ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్రావు, రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారిలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత అధికారులతో రేషన్కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఇల్లు లేని నిరుపేద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం క్రింద ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని, రేషన్ కార్డుల జారీలో నిబంధనలు పాటిస్తూ అర్హులైన అభ్యర్థుల వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గతంలో మీ-సేవ కేంద్రాలలో చేసుకున్న దరఖాస్తులు, సామాజిక, ఆర్థిక, విద్య, వైద్య, రాజకీయ, కుల గణన కార్యక్రమంలో సేకరించిన సమాచారం, ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలు జాబితాలో రానప్పటికీ మండల ప్రజా పరిషత్ కార్యాలయాలు, ప్రజాపాలన సేవా కేంద్రాలలో, గ్రామ సభలలో దరఖాస్తు చేసుకోవచ్చని, దరఖాస్తుల వివరాలు కంప్యూటరైజ్ చేయబడతాయని, అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి ఆహార భద్రత రేషన్ కార్డు అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రేషన్ కార్డు కలిగి ఉండి కుటుంబ సభ్యుల నమోదు, విభజన అవకాశం కల్పించడం జరుగుతుందని తెలిపారు. రేషన్ కార్డు ప్రక్రియకు సంబంధించి ప్రతి రోజు నివేదికను జిల్లా ఇన్చార్జ్ మంత్రికి సమాచారం అందించాలని, రేషన్ కార్డు దరఖాస్తు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. రైతు భరోసా పథకంలో వ్యవసాయ యోగ్యం కాని రాళ్లు, గుట్టలు, కాలనీలు, ఇండ్ల వెంచర్లు, లే-అవుట్లు, నాలా భూములు, వివిధ అభివృద్ధి పథకాల కొరకు ప్రభుత్వం సేకరించిన భూములు జాబితా నుండి తొలగించాలని తెలిపారు. సొంత స్థలం కలిగి ఉండి ఇల్లు లేని అర్హత గల నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తించేలా చూడాలని తెలిపారు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇండ్ల కొరకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాల పరిశీలన అనంతరం అర్హుల జాబితాలో మట్టి గోడలతో నిర్మించిన ఎ.సి. షీట్స్, పెంకులు, రేకులు ప్రాధాన్యత క్రమంలో అత్యంత నిరుపేద అర్హులకు పథకం వర్తింపజేయడం జరుగుతుందని తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం క్రింద నిరుపేద కూలీలు, వ్యవసాయ కూలీలు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజులు పని చేసిన కుటుంబాలను గుర్తించాలన్నారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాపాలనలో రేషన్కార్డు కొరకు దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు సేకరించడం జరుగుతుందని, ఈ క్రమంలో జిల్లాలోని 16 మండలాలో 11 వేల 767 ఇండ్లు ఉండగా 7 వేల 927 ఇండ్లు సర్వే చేయడం జరిగిందని, 7 మున్సిపాలిటీలలో 18 వేల 788 ఇండ్లు ఉండగా 14 వేల 25 ఇండ్ల నుండి వివరాలు సేకరించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 35 వేల 956 రేషన్ కార్డులలో అదనపు సభ్యుల నమోదు దరఖాస్తులు అందాయని, పరిశీలించడం జరుగుతుందన్నారు.

# కలప అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

**జన్నారం, జనవరి 18 (ప్రభాత సమాచారం)**



అవ్వాలి టైగర్ జోన్ పరిధిలో కలప అక్రమ నిలువ ఉంచిన రవాణా చేసిన టైగర్ జోన్ నిబంధనలు మేరకు కఠిన చర్యలు తప్పవని ఇంధన్ పల్లి ఎఫ్ఆర్ఓ కారం శ్రీనివాస్ అన్నారు. ఇందన్ పెల్లి రేంజ్ కార్యాలయం పరిధిలోని హాస్టల్ తండా నాయక గుడా గ్రామాలలో శనివారం ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఆ గ్రామాలకు చెందిన కొంతమంది అక్రమంగా కలప రవాణా చేస్తూ ఇందులో నిల్వ ఉంచుకుంటున్నారనే సమాచారం మేరకు తనిఖీలు చేశామన్నారు. ఎఫ్ ఎస్ఓలు రవి, హనుమంతరావు ముసిపుద్దిన్ రూబీనా తదితరులు పాల్గొన్నారు.

# ఉదారత చాటిన 2004 బ్యాచ్ కానిస్టేబుల్

**ఆదిలాబాద్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా 2004 ఏఆర్ బ్యాచ్ కి చెందిన అక్తర్ ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ (ఏఆర్ హెచ్.సి) సంజయ్‌నగర్ ఆదిలాబాద్ లో స్థిరపడ్డాడు. రెండు సంవత్సరాల క్రితం 317 జీవో కారణంగా ఆసిఫాబాద్ జిల్లాలో విధులు నిర్వహిస్తు జనవరి 2న అనారోగ్య కారణంగా మృతిచెందారు. వారి కుటుంబానికి ఆర్థిక చేయుత ఇవ్వడానికి ఉమ్మడి జిల్లాకు చెందిన 2004 సివిల్ అండ్ ఏఆర్ బ్యాచ్ ఆర్థికంగా ముందుకు వచ్చి వాళ్ళ కుటుంబానికి రెండు లక్షల ఆర్థిక సహాయాన్ని శనివారం అందజేశారు. అందులో భార్య పిల్లలకు 1,50,000 ఆర్థిక చేయూతనందించారు. అలాగే అక్తర్ వాళ్ళ తల్లిదండ్రులకు రూ.50వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి 2004 బ్యాచ్ తరపున, ఆర్ఐ డి వెంకట్, కిషోర్, ప్రవీణ్, అజయ్, రాందాస్, ప్రకాష్, విజయ్, రాజేశ్వర్, ధనరాజ్, సతీష్, కైలాష్ 2004 బ్యాచ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సభ్యులు ఉన్నారు.

## జూనియర్ కళాశాలను తనిఖీ చేసిన

# విద్యాశాఖ అధికారి పరుశురాం

**కుభీర్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రమైన కుభీర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను శనివారం జిల్లా విద్య శాఖ అధికారి జాదవ్ పరుశురాం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్బంగా కళాశాలలో పాలు రికార్డులను పరిశీలించి విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు పాలు రకాల సూచనలు సలహాలు అందించారు. దీంతో ఆయన మాట్లాడుతూ కాలశాలలో చదువుకునే విద్యార్థులు ప్రతి ఒక్కరు మంచి ఫలితాలు వచ్చేలా చూడలని అన్నారు. ఎప్పటికప్పుడు ఉపధ్యాయులు చేపిన పాఠాలు శ్రద్ధగా విని నోట్స్ చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించి విద్యార్థుల హాజరు శాతం పెంపు నాకు కృషి చేయాలని అధ్యాపకులకు సూచించారు. ఆయన వెంట కళాశాల ప్రిన్సిపాల్ సునీల్ కుమార్ అధ్యాపకులు సంపత్ హన్మంత్ రావు రమేష్ నర్సయ్య శ్రీనివాస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# ఆష్టా గ్రామంలోని రామాలయంలో మండల పూజ



**ముథోల్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

ముధోల్ మండలంలోని ఆష్టా గ్రామంలో ఇటీవల ప్రాణఃప్రతిష్టాపన జరిగిన శ్రీ రామాలయంలో శనివారం మండల పూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు ఆలయ కమిటీ చైర్మన్ ఆర్మూర్ సంతోష్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు కొనసాగాయి. శ్రీ సీతారాములు లక్ష్మణ ఆంజనేయ స్వాములకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజన భజంతులతో పాటు శ్రీరాములవారి గుడిలో సీతారాములను అలంకరణ చేశారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ ముధోల్ తహసీల్దార్ శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు రావుల గంగారెడ్డి శ్రీ సీతారాముల ఆలయాన్ని దర్శించుకున్నారు. రామాలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. శ్రీ రామాలయ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. భక్తులకు అన్నప్రసాధమునుఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యూత్ సభ్యులచే నూతన రామాలయ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేశారు. ఉత్సవ్ కమిటీ అధ్యక్షులుగా లోలం మురళి, సాకలి గంగాధర్, ఉపాధ్యక్షులు కండెల భరత్ సెక్రటరీ స్వరాజ్ క్యాషియర్ సురుగుల రాము కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

# స్వర్గీయ ఎన్టీఆర్‌కు నివాళులు..

**నిర్మల్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు శనివారం నివాళులర్పించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని రూరల్ పోలీస్ స్టేషన్ సర్కిల్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి నిర్మల్ మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, నాయకులు, సభ్యులు, అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా చేర్మెన్ ఈశ్వర్ మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీఆర్ గొప్ప నాయకుడని అడుగుజాడల్లో నడుచుకోవాలని కోరారు.



# ఆదిలాబాద్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ ఇల్లు దగ్ధం

**ఆదిలాబాద్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా పట్టణంలోని రణదీవెనగర్ కాలనీలో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. అగ్నిమాపక అధికారులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాలనికి చెందిన వెంకటేశ్ ఇంట్లో మధ్యాహ్నం సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. రేకులషెడ్డులోని విద్యుత్తు మీటర్ల వద్ద తలెత్తిన మంటలు ఇంటిమొత్తం వ్యాపించాయి. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు కేకలు వేస్తు బయటకు పరుగులు తీశారు. దీంతో చుట్టు పక్కల వారు పోగై విద్యుత్తు సరఫరాను నిలిపివేయించారు. పక్కనే ఉన్న మునీర్ అనే వ్యక్తి ఇంటికి సైతం మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక అధికారులు ఘటన స్థలానికి చేరకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే వెంకటేశ్ ఇళ్లు దాదాపుగా కాలిపోయింది. దట్టమైన పొగలు వ్యాపించడంతో కాలనీవాసులు ఆందోళనకు గురయ్యారు. ఇంట్లోని ఎలక్ట్రానిక్ పరికరాలు, నిత్యావసరాలు, దుస్తులు, ఇతర సామాగ్రి కాళి బూడిదైందని, పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరారు.





# ఆదిలాబాద్ పాఠశాలలను ఆరోగ్య పాఠశాలలుగా తీర్చిదిద్దాలి

**ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

మనిషిలో వచ్చిన మంచి మార్పు ఎప్పటికీ ఉండాలని, నెల రోజులపాటు పాటించి వదిలివేయవద్దని కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. ప్రతీ రోజూ ప్రతీ పాఠశాలలో, ఉదయం ప్రార్థన సమయంలో, సాయంత్రం వేళల్లో ఆరు సూత్రాలతో పాటు యోగా నిర్వహించాలని, అన్ని పాఠశాలలు ఆరోగ్య పాఠశాలలుగా తీర్చిదిద్దాలని అన్నారు. శనివారం ఆరోగ్య పాఠశాలలపై కలెక్టర్ రాజర్షి షా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య పాఠశాల కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల్లో వచ్చిన మార్పులను 44 ప్రభుత్వ పాఠశాల నుండి వచ్చిన స్టూడెంట్ చాంపియన్ విద్యార్థులు కలెక్టర్ కు వివరించారు. ఆరు సూత్రాల అమలు ప్రతి సోమవారం వ్యక్తిగత పరిశుభ్రత, మంగళవారం పోషకాహారంపై అవగాహన, బుధవారం ఒత్తిడి నివారించుకునే మార్గాలు, గురువారం డ్రగ్స్ కు దూరంగా ఉండడం, శుక్రవారం కాలానుగత వ్యాధుల నివారణ, శనివారం వ్యక్తిత్వ వికాసంతో పాటు మరికొన్ని ఆరోగ్య అంశాలను చేర్చి విద్యార్థులకు అవగాహన కలిగించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆరు సూత్రాల అమలులో విద్యార్థుల్లో చాలా మార్పులు వచ్చాయని, పొగాకు, గుట్కా తినడం మానివేశారని, జంక్ ఫుడ్ తీసుకోవడం లేదని, క్రమ శిక్షణతో పాటు, అరో గ్య అలవాట్లను పాటిస్తూ, తల్లిదండ్రుల్లో మార్పులు తీసుకు వచ్చామని విద్యార్థులు తెలిపారు. ఇదే పద్ధతిలో ముందుకు వెళతామని అన్నారు. ఇప్పటి వరకు 133 పాఠశాలలను రివ్యూ చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఆరు సూత్రాల అమలుతో విద్యార్థుల్లో చాలా మార్పులు వచ్చాయని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం స్టూడెంట్ చాంపియన్ విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి ప్రణీత, ఆయా పాఠశాలల నుండి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్టూడెంట్ చాంపియన్ లు పాల్గొన్నారు.



## వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇవ్వాలి



**ఆదిలాబాద్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు వ్యవసాయ కూలీలకు రూ.12 వేలను ఇవ్వాలని, రైతు ఆత్మీయ భరోసా పథకానికి ఉపాధి హామీని లింక్ చేయకూడదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ కూలీల సంఖ్యను తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సరికావని అన్నారు. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు.కూలీలు లేకుంటే వ్యవసాయ సాగు కాదన్నారు. పథకంలో వ్యవసాయ కూలీలకు ప్రాధాన్యత ఇచ్చి వారిని ఆదుకోవాలని కోరారు. సమావేశంలో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు స్వామి, నాయకులు ఆశన్న, పోచక్క ఉన్నారు.

## భైంసా డిపో నుంచి హైదరాబాద్‌కు ప్రత్యేక బస్సులు

**భైంసా, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

భైంసా ఆర్టీసీ డిపో నుండి అది, సోమ రెండు రోజులు హైదరాబాద్ కు ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు శనివారం డిపో మేనేజర్ హరి ప్రసాద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణం నుండి సంక్రాంతి పండుగ వేడుకలకు స్వగ్రామాలకు వచ్చి తిరిగి వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా సురక్షిత ప్రయాణం కొరకు బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రయాణికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## యువకుడిని కాపాడిన బ్లూ కోర్ట్ సిబ్బంది

**బాసర, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

బాసర పోలీసులు గోదావరి నది వద్ద ఆత్మహత్య చేసుకోవడానికి వచ్చిన ఎందరినో గుర్తించి వారి ప్రాణాలను కాపాడటంతో పోలీస్ శాఖ ఉన్నతాదికారులతో పాటు, ప్రజలు, భక్తుల నుండి ప్రశంసలు పొందుతు పోలీసులు శభాష్ అనిపించుకుంటున్నారు. వివరాల్లోకి వెళ్తే.. నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు ఆత్మహత్యల నివారణ కోసం బాసర బ్రిడ్జి పై 24/7 పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. దీంతో తాజాగా శనివారం నిజామాబాదు జిల్లా కేంద్రానికి చెందిన ఆటోడ్రైవర్ విట్టల్ సంతోష్ అనే వ్యక్తి కుటుంబ కలహాల కారణంగా జీవితంపై విరక్తి చెంది తన ఆటోలోనే బాసర బ్రిడ్జికి చేరుకున్నాడు.స్నాన ఘట్టాల వద్ద ఆటో లోనే కూర్చుని సూసైడ్ నోట్ రాసుకుంటుండగా, గమనించిన బ్లూకోట్ పోలీసు సిబ్బంది ప్రమోద్, గగన్‌లు సూసైడ్ నోట్‌ని స్వాధీన పరుచుకొని, బాసర ఎస్సై గణేష్‌కు సమాచారం అందించారు. దీంతో పోలీసులు బాధితుడికి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం బాధితుడు విఠల్ సంతోష్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిండు ప్రాణంను కాపాడిన బాసర ఎస్సై గణేష్‌తో పాటు,బ్లూకోట్ పోలీసు సిబ్బంది ప్రమోద్, గగన్‌లను ఏఎస్పీ అవినాష్ కుమార్, ముధోల్ సిఐ మల్లేష్‌లు అభినందించారు.



## క్రీడల్లో గెలుపోటములు సహజం

### పాల్గొన్న ఆర్ఎంపి-పిఎంపీలు వైద్యులు



**భైంసా, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

భైంసా మండలంలోని వానల్పాడ్ గ్రామంలో డివిజన్ స్థాయి ఆర్ఎంపి-పిఎంపి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు అలరించాయి. ఆధునిక యుగంలో ప్రతి ఒక్కరూ వివిధ రకాల వ్యాధులతో బాధపడుతున్నారు. దీంతో ఉపశమనం పొందేందుకు క్రీడలే ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు తమకు అనువైన సమయంలో ఇష్టమైన క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల శారీరక మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చు అన్నారు. క్రికెట్ పోటీలు చూపరులను విశేషంగా అకట్టుకున్నాయి. డివిజన్లోని వివిధ మండలాల చెందిన ఆర్ఎంపి-పిఎంపీలు క్రికెట్ పోటీల్లో పాల్గొని తమలో అంతర్గతంగా దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. పోటీల్లో విజేతగా భైంసా ఆర్ఎంపీ అసోసియేషన్ జట్టు నిలిచింది. క్రీడాకారులకు మెమొంటోలను ముఖ్య అతిథులు లైన్స్ క్లబ్ బాసర అధ్యక్షుడు బోస్లే నందకిషోర్ పటేల్, డాక్టర్ ముత్యం రెడ్డి, డాక్టర్ నాగేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపి- పిఎంపి డివిజన్ అధ్యక్షులు ఆశమొల్ల మోహన్, జిల్లా అధ్యక్షుడు పోశట్టి, కార్యదర్శి గంధం పోషట్టి, ఆయా మండలాల అధ్యక్షులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**లోకేశ్వరం, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

లోకేశ్వరం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని ఆయా గ్రామాల కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శనివారం ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ అందజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్, మండల అధ్యక్షులు, ఆయా గ్రామాల తాజా మాజీ, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు ,ఎంపీటీసిలు, మండల నాయకులు, కార్యకర్తలు, మండల అధికారులు, తదితరులు ఉన్నారు

## గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్టు



**జన్నారం, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

మండలంలోని పైడిపల్లి హనుమాన్ టెంపుల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఇద్దరి వద్ద 30 గ్రాముల గంజాయి లభించిందని జన్నారం ఎస్సై గుండేటి రాజావర్ధన్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం శనివారం నమ్మదగిన సమాచారం మేరకు పైడిపల్లి హనుమాన్ టెంపుల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా కామెర నగేష్, బెంబడి పవన్ వద్ద 30 గ్రాముల గంజాయి లభించిందని, దాంతో వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

## పేకాట ఆడుతున్న ఆరుగురి అరెస్టు

**బెల్లంపల్లి, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

మండలంలోని పాత బెల్లంపల్లి శివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను శనివారం రాత్రి అరెస్టు చేసినట్లు తాళ్ల గురిజాల ఎస్సై రమేష్ తెలిపారు. తిరుపతి, మధుకర్, కుమార్, గోపి, కృష్ణ స్వామి, సత్యనారాయణలు పట్టుబడినట్లు పేర్కొ న్నారు. వారి వద్ద నుంచి రూ.18,850 నగదు, స్వాధీనం చేసుకున్నారు.

## ముధోల్‌లో కుక్కల బీభత్సం : పది మందికి గాయాలు



**ముధోల్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

నియోజకవర్గం కేంద్రమైన ముధోల్ ల్లో ఊర కుక్కల బీభత్సం సృష్టించాయి. అయితే ముధోల్‌లో శనివారం ఊర కుక్కలు పదిమందికి గాయపరిచాయి. దీంతో స్థానిక ప్రభుత్వాసుపత్రిలో బాధితులు టీకాలు తీసుకున్నారు. ముధోల్‌కు చెందిన సంజయ్, యూసుఫ్ ఖాన్, సాయిఖ్, వినోద్, ఎస్‌డి కలీం, ఎండి కలీం, జ్యోతి, హరిత,రూప,లకు కుక్కల దాడి లో గాయపరిచాయి. పిచ్చి కుక్కలు గ్రామాలలో స్వైర విహారం చేస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. కుక్కల దాడిలో గాయమైన వారికి స్థానిక ముధోల్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు డాక్టర్ సువర్ధన్, డాక్టర్ రాహుల్, డాక్టర్ విజేష్ లు బాధితులకు టీకాలు (ఆంటీ రేబీస్ వ్యాక్సిన్) వేసినట్లు తెలిపారు. అయితే ఇందులో తీవ్రంగా గాయమైన కొందరికి రేబిస్ ఇమ్యూనోగ్లోబిలిన్స్ కొరకు భైంసా ప్రభుత్వ ఆసుపత్రికి పంపి నట్లు వైద్యులు పేర్కొన్నారు.





# 'పది'కి పక్కా ప్రణాళిక

## హ్యాట్రిక్ కోసం డీఈఓ పకడ్బందీ ప్రణాళిక

- టెన్త్ ఫలితాలపై ప్రత్యేక శ్రద్ధ
- టెన్త్‌లో జిల్లా రికార్డు పదిలం కోసం పరుగులు
- 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా కార్యాచరణ
- పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్న నిర్మల్ డీఈఓ
- విద్యార్థులకు ఉదయం, సాయంత్రం తరగతులు



**నిర్మల్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

డీఈఓ ఓ దృష్టంతా 10 ఫలితాల వైపే ...డిఇఓగా బాధ్యత చేపట్టిన నాటి నుంచి పి. రామారావు గొప్ప టార్గెట్‌ను నిర్ణయించుకొని దాని సాధనలో రాత్రింబవళ్లు పర్యటనలు జిల్లా వ్యాప్తంగా కొనసాగిస్తున్నారు. ఎక్కడికి వెళ్ళినా ఇదివరకు ఉన్న 10 ఫలితాల రికార్డును నిలబెట్టి ఈ సారి హ్యాట్రిక్‌ను సాధించాలని హితబోధ చేస్తున్నారు .విద్యార్థులకే కాకుండా ఉపాధ్యాయులకు కూడా హ్యాట్రిక్ బోధనలు గుప్పిస్తున్నారు. 100% విద్యార్థులు, ఉపాధ్యాయులు సమయానికి రావడంతో పాటు ప్రత్యేక తరగతుల్లో గైరహాజరును నివారించాలని చెప్తున్నారు. వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచిస్తున్నారు .జిల్లాలోని అన్ని యాజమాన్యాల్లో కొనసాగుతున్న ఉన్నత పాఠశాలల పై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తన పర్యటనలు జరుపుతున్నారు. పర్యటనలో తరగతుల పర్యవేక్షణ, వంటావార్పు తీరు, ముఖ్యంగా పదవ తరగతి విద్యార్థులతో ముఖాముఖి మాట-ముచ్చట, విజయానికి బాట.. అనే అంశాలనే తన ఎజెండాగా ముందుకు వెళ్తున్నారు. విద్యార్థులకు సందేహాలు ఉంటే సంబంధిత విషయ బోధకులతో నివృత్తి చేసుకుంటుండాలని చెప్తున్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థులకు ఉపాధ్యాయులు స్లిప్ టెస్ట్ తదితర పరీక్షలతో వారి యొక్క ఉన్నతిని అంచనా వేస్తూ ఉండాలని డిఇఓ పేర్కొంటున్నారు .విద్యార్థుల ప్రగతిని జిల్లా కలెక్టర్ స్వయంగా పర్యవేక్షిస్తారని గుర్తు చేస్తున్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను గ్రూపులుగా విభజించి ఒక్కొక్క గ్రూపుకు ఒక ఉపాధ్యాయుడు ప్రణాళిక అబద్ధంగా పర్యవేక్షిస్తూ వారికి సలహాలు ఇస్తూ ఉండాలని అంటున్నారు .వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి ఉదయం, సాయంత్రం సమయాల్లో విద్యార్థులకు ఫోన్ కాల్ ద్వారా వారి చదువును పర్యవేక్షించాలని కోరుతున్నారు. ఇదిలా ఉండగా... సంక్రాంతి సెలవుల అనంతరం పాఠశాలలు ప్రారంభం కాగానే శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు, మామడ, ఖానాపూర్ ఉన్నత పాఠశాలలను చుట్టి వచ్చారు. ఈ పర్యటన క్రమంలో విద్యార్థుల ఎఫ్ఏవన్ నోట్ బుక్కులు , ప్రాజెక్టు బుక్స్ పరిశీలించడంతోపాటు విద్యార్థుల ప్రగతిని తెలిపే మార్కుల జాబితాలను పరిశీలించారు. ఉపాధ్యాయులు అత్యవసరమైతే తప్ప భవిష్యత్తులో సెలవులకు దూరంగా ఉండాలని తెలిపారు .ఈ పాఠశాలల సందర్శనలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంట మామడ ప్రధానోపాధ్యాయుడు ఈశ్వర్, జిల్లా పరీక్షల బోర్డు సహాయ కార్యదర్శి భానుమూర్తి, ఖానాపూర్, కడెం మండలాల విద్యాశాఖ అధికారులు ప్రేమ్ సాగర్, షేక్ హుస్సేన్ ఉన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

## మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్

**నిర్మల్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలోమహిళలు స్వయం సహాయక సంఘాలు అభివృద్ధిలో ముందుండాలని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ అన్నారు.. మహిళల ద్వారా నిత్యావసరాలు అయినా డిటర్జెంట్, ఫ్లోర్ క్లీనర్, టాయిలెట్ క్లీనర్ లాంటి వస్తువులు తయారు కేంద్రాన్ని సంఘ మహిళలతో కలిసి మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ శనివారం ప్రారంభించారు. ప్రోడక్ట్స్ తయారు చేయు సంబంధిత యంత్రాన్ని బటన్ వేసి స్టార్ట్ చేశారు. అనంతరం వారిని అభినందించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కోరారు.. స్వయం సహాయక సంఘాలకు మార్కెటింగ్ వసతులు కల్పించాలని అధికారులను కోరారు.. ఇలాంటి శిక్షణలు ఏడీ సంస్థకి కృతజ్ఞతలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ సుభాష్, ఎడి సంస్థ ప్రతినిధులు అలేఖ్య, రవి, దేవేందర్ లతో పాటు మెప్మా సిబ్బంది ఆర్పీలు, పాల్గొన్నారు.. తయారీదారులు మంచి నాణ్యతను పా టించి మార్కెట్‌లో ముందుండాలన్నారు. కౌన్సిలర్ రమ్య-విజయ్, మాజీ కౌన్సిలర్ ధర్మజి శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.



# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన డీసీసీ అధ్యక్షులు



**నిర్మల్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**


రత్నాపూర్ కాండ్లి గ్రామానికి చెందిన మొహమ్మద్ హాఫీజ్ భార్య తాహెర బేగం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కూచాడి శ్రీహరి రావు రత్నాపూర్ కాండ్లిలోని వారికు టుంబ సభ్యులను పరామర్శించారు. ఇందులో మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డి, నరేష్ రెడ్డి, రాంరెడ్డి ఉన్నారు.

# వంద పడకల దవాఖాన సూపరింటెండెంట్‌గా కిరణ్ కుమారి

**బెల్లంపల్లి, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

బెల్లంపల్లి వందపడకల దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమారి నియామకమయ్యారు. ఈ మేరకు శనివారం సూపరింటెండెంట్ ఛాంబర్‌లో ఆమె పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన డాక్టర్ రవి అనారోగ్యంతో సెలవులో ఉన్నారు. సివిల్ సర్జన్ ప్రత్యేక వైద్యురాలు, గైనకాలజిస్ట్ కిరణ్ కుమారిని నియమిస్తూ వైద్యఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.



# అర్హులందరికి రేషన్ కార్డులు

- గ్రామ సభలలో దరఖాస్తుల స్వీకరణ
- రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ
- జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రులు పొంగులేటి, తుమ్మల, ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ఆదిలాబాద్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డ్ లు జారీ చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది. రేషన్ కార్డుల జారీ ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతరం ప్రక్రియాని చివరి లబ్ధిదారుల వరకు అందిస్తామని ప్రకటించారు. ఇందులో ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలలో వచ్చిన దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజాపాలన లో వచ్చిన దరఖాస్తులను కూడా పరిశీలించాలని కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారిచేసింది. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న రేషన్ కార్డ్‌ల లబ్ధిదారుల జాబిత కులగణన (సామిజిక) సర్వే ఆదారంగా తయారు చేసిందని ఇది తుది జాబితా కాదని పేర్కొంది. ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, గ్రామ సభల నిర్వహణ, తదితర అంశాలపై శనివారం నాడు డా.బి. ఆర్.అంబేద్కర్ సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర నీటిపారుదల, పౌర సరంరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి విడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పాలనాధికారి రాజర్షి షా , అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మట్, ట్రైనీ కలెక్టర్ అభిగ్యాన్ సీఈఓ జితేందర్, రవీందర్, సివిల్ సప్లై, వహీద్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26వ తేదీ నుంచి ప్రతిష్టాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టబోతుంది. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలలో దరఖాస్తులను స్వీకరించాలని కలెక్టర్లను ఆదేశించారు. ప్రజాపాలన సేవా కేంద్రాల ద్వారా కూడా కొత్త రేషన్ కార్డులకు లేదా కొత్త సభ్యుల చేర్పులకై దరఖాస్తులు కూడా స్వీకరించాలని స్పష్టం చేశారు. ఇప్పటికే, గతంలో జరిగిన ప్రజాపాలన సదస్సులలో స్వీకరించిన దరఖాస్తుల జాబితాలో అర్హులైన వారిని గుర్తించే ప్రక్రియ పురోగతిలో ఉందని తెలిపారు. ఈనెల 26 ప్రారంభించే నాలుగు పథకాలపై 21వ తేదీ నుండి ప్రారంభమయ్యే గ్రామసభల్లో ప్రజా అభిప్రాయలు/ ఫీడ్ బ్యాక్ లను తీసుకోవడంతో పాటు ఈ గ్రామ సభలు, ప్రజా పాలన సేవా కేంద్రాలలో కొత్తగా తీసుకున్న దరఖాస్తులు, కార్యాలయంలో ఇప్పటికే ఉన్న దరఖాస్తులను తగు రీతీలో పరిశీలించిన తర్వాత మాత్రమే అర్హులైన లబ్ధిదారుల తుది జాబితాను ప్రకటించడం జరుగుతుందని మంత్రులు స్పష్టం చేశారు. అర్హులైన తుది జాబితాలను ప్రకటించడానికి ప్రభుత్వం తదుపరి ఉత్తర్వులు జారీచేయడం జరుగుతుందని తెలియ చేశారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఇంటి స్థలం ఉన్న వారి జాబిత ఇంటి స్థలం లేని వారి రెండు జాబితాలను గ్రామ సభలలో ప్రదర్శించాలని, అలాగే కొత్తగా గ్రామ సభలలో వచ్చే దరఖాస్తులను కూడా పరిశీలించాలని సూచించారు. రాష్ట్రంలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డులను ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. రేషన్ కార్డుల మంజూరికిగాను దరఖాస్తులను స్వీకరించే ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు. వ్యవసాయ యోగ్యమైన ప్రతీ భూమికి రైతు భరోసా కల్పించడం జరుగుతుందని అన్నారు. గతంలో వివిధ ప్రాజెక్టులకు, రహదారులకు, ఇతర ప్రభుత్వ అవసరాలకు ప్రభుత్వం సేకరించిన భూముల వివరాలు తహసీల్దార్ల వద్ద ఉన్నాయని తెలిపారు. వ్యవసాయ అధికారులు, రెవిన్యూ అధికారులు సంయుక్తంగా రైతు భరోసా లబ్దిదారులను గుర్తించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కనీసం ఇరవై రోజుల పాటు కూలి పనికి వెళ్లిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింప చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతీ కుటుంబంలో మహిళల బ్యాంకు కాతాలకే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొత్తాన్నిబదిలీ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఇటీవల రాష్ట్రంలో 156 గ్రామాలను మున్సిపాలిటీలలో కలపడం జరిగిందని, ఈ గ్రామాల్లో 2023 -24 లో జరిగిన ఉపాధి హామీ పనుల జాబితాను పరిగణనలో తీసుకోవడం జరుగుతుందని వారు స్పష్టం చేశారు. గతంలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభల మాదిరిగానే 21 నుండి జరిగే గ్రామ సభలకు కూడా చేపట్టాలని అన్నారు. ప్రతి రోజు ఒక గ్రామ పంచాయితీ లో మాత్రమే గ్రామ సభ నిర్వహించాలని, ఈ గ్రామ సభలకు హాజరయ్యే ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.



## మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ

# తెలంగాణ మావోయిస్ట్ పార్టీ సెక్రటరీ దామోదర్ మృతి

- ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన దామోదర్
- ఎన్నో ఏళ్ల నుంచి మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న దామోదర్
- మావోయిస్టు పార్టీలో అంచలంచెలుగా ఎదిగిన బడే చొక్కారావుకు ఆదిలాబాద్ జిల్లాలో గట్టి పట్టు

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)
మావోయిస్టు పార్టీ తెలంగాణ కార్యదర్శి బడే చొక్కారావు, అలియాస్ దామోదర్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. బీజాపూర్ జిల్లా ఉసూరు పోలీస్ స్టేషన్ పరిధి పూజారి కంకేర్ – మారేడుబాక గ్రామ సమీప అడవుల్లో ఈనెల 16న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లుగా ఈ మేరకు మావోయిస్టు పార్టీ సౌత్ బస్తర్ డివిజనల్ కమిటీ శనివారం స్వయంగా ఒక ప్రకటనను విడుదల చేసింది. ఈ ఎన్‌కౌంటర్‌లో ఏకంగా 18 మంది మావోయిస్టులను కోల్పోయినట్లు ప్రకటనలో పేర్కొన్నారు. 'చనిపోయిన వీరులు తమ చివరి శ్వాస వరకు పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడారు. ముఖ్యంగా కామ్రేడ్ బడే చొక్కారావు ధైర్యసాహసాలను ప్రదర్శించి, పోరాడుతూ అమరుడయ్యాడు. అతని మరణం సంస్థకు కోలుకోలేని నష్టాన్ని కలిగించింది. అయితే అతని విప్లవాత్మక వారసత్వం వేలాది మంది కొత్త సహచరులకు స్ఫూర్తినిస్తుంది' అంటూ లేఖను విడుదల చేశారు. తెలంగాణలో మావోయిస్టు పార్టీని విస్తరించాలనే లక్ష్యంతో అనేక ఆపరేషన్లు నిర్వహించిన ఆయన ఉద్యమంలోనే తుది శ్వాస విడించారు. దామోదర్ భార్య నర్సక్క అలియాస్ సబితక్క 2011 లోచర్ల ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందింది.

**30 ఏళ్లుగా ఉద్యమంలోనే..**

గత 30 ఏళ్లుగా మావోయిస్టు ఉద్యమంలో కొనసాగుతూ వస్తున్న చొక్కారావు.. పార్టీలో అంచలంచెలుగా రాష్ట్ర కార్యదర్శి స్థాయికి ఎదిగారు. చొక్కారావు ఎన్నో ఏళ్లుగా భద్రతా బలగాలకు మోస్ట్ వాంటెడ్‌గా ఉంటూ వస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం చొక్కారావుపై రూ.50 లక్షల రివార్డు ప్రకటించగా.. తెలంగాణ రాష్ట్రం సైతం రూ.25 లక్షల రివార్డు ప్రకటించింది. దామోదర్‌ది ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి. ఆయన సోదరుడు బడే నాగేశ్వర్ రావు కూడా మావోయిస్టు పార్టీలో కీలక నేతగా పనిచేశారు. 2008లో బడే నాగేశ్వర్‌రావు దంపతులు తాడ్వాయి అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందారు. సోదరుడు నాగేశ్వర్ రావు అడుగు జాడల్లోనే విప్లవ బాటలో దామోదర్ నడిచారు. 1993లో అప్పటి పీపుల్స్‌వార్‌లో చేరిన దామోదర్ ఏటూరునాగారం ఏరియా కమిటీలో చేశారు. ఏటూరునాగారం ఎస్టీ హాస్టల్‌లో పదో తరగతి వరకు చొక్కారావు చదువుకున్నారు. ఈ ప్రాంతంపై దామోదర్ గట్టి పట్టు సాధించారు. మూడుదశాబ్దాలుగా పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, యాక్షన్ టీం కమాండర్‌గా వ్యవహరించారు.

**పోలీసులకు సవాల్..!**


తెలంగాణలో జిల్లాల పునర్విభజనకు ముందు కరీంనగర్, ఖమ్మం, వరంగల్(కేకేడబ్ల్యూ) డివిజన్ కమిటీ కార్యదర్శిగా దామోదర్ పనిచేశారు. 2019లో జేఎండబ్ల్యూపీ డివిజన్ కార్యదర్శి బాధ్యతల నుంచి పార్టీ తప్పించి రాష్ట్ర కమిటీలోకి తీసుకుంది. రాష్ట్ర యాక్షన్ టీమ్ కమిటీ కమాండర్‌గా పదోన్నతితో నియమించింది. ఉత్తర తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో దామోదర్‌కు గట్టి పట్టుండటంతో జిల్లాలోనూ పార్టీ బలోపేతానికి ప్రయత్నాలు చేవారు. అందుకు తగ్గట్టుగానే మావోయిస్టు కార్యకలాపాలను విస్తరించేందుకు అనేక ప్రయత్నాలు చేశారు.

## ఘనంగా ఎన్టీఆర్ వర్ధంతి

కాగజ్‌నగర్, జనవరి 18 (ప్రభాత సమాచారం)
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు స్వర్గీయ నందమూరి తారక రామారావు 29వ వర్ధంతిని కాగజ్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ చౌక్‌లో ఎన్టీఆర్ విగ్రహానికి ఆదిలాబాద్ పార్లమెంటు కన్వీనర్ గుల్లపల్లి ఆనంద్ తో పాటు పార్టీ నాయకులు కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపించి పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం పాటుపడిన మహా నేత పటేల్ పట్వారి వ్యవస్థ రద్దుచేసి అదేవిధంగా మహిళలకు సమాన హక్కును కల్పించిన మహానీయుడు ఎన్టీఆర్ అని కొనియాడారు.ఆయన తెలుగు ప్రజలకు చేసిన సేవలు ఎనలేనివని, తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారని పేర్కొన్నారు.పేద ప్రజల కోసం అహర్నిశలు సేవలను అందించి పేద ప్రజల గుండెల్లో నిలిచిన మహా నేత ఎన్టీఆర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి పాటుపడ్డారని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎల్ మధుకర్, చల్లూరి శంకర్, వై.శ్రీనివాస్ సురేందర్ సమ్మగౌడ్ తహేర్, సత్యం,శ్రీను శ్రీను తదితరులు పాల్గొన్నారు.



## రైతు ఉత్పత్తి సంఘాలదే భవిష్యత్ : ఐటీడీఏ పీఓ



ఆసిఫాబాద్, జనవరి 18 (ప్రభాత సమాచారం)
భవిష్యత్‌లో రైతుల స్థితిగతులను తీర్చిదిద్దడంలో రైతు ఉత్పత్తి సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా అన్నారు. శనివారం ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో ట్రైకార్ మొదటిదశ చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ట్రైకార్ ఆధ్వర్యంలో ఆసి ఫాబాద్ జిల్లా జైనూరు, రెబ్బెన రైతుఉత్పత్తి సంఘాలకు మొదటిదశ రాయితీగా ఒక్కోరైతు ఉత్పత్తి సంఘానికి రూ.7.50లక్షల చొప్పున రూ.15లక్షలు విడుదల య్యాయి. వాటికి సంబంధించిన చెక్కును పీవో అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఉద్యానవ అధికారి సందీప్‌కుమార్, సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్టుమేనేజర్ సుజాత, రైతు ఉత్పత్తి సంఘాల సభ్యులు వినోద్, ప్రశాంత్, ప్రజ్ఞాశీల్, బోర్డు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

### మందమర్రి మున్సిపాలిటీకి

# ఎన్నికలు నిర్వహించాలి

మందమర్రి, జనవరి 18 (ప్రభాత సమాచారం)
పాలకవర్గం లేని మందమర్రి మున్సిపాలిటీకి ఎన్నికలు నిర్వహించాలని అఖిలపక్ష పార్టీల నాయకులు అందుగుల శ్రీనివాస్, కొంగల తిరుపతిరెడ్డి, రాయబారపు వెంకన్నలు తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ మున్సిపాలిటీకి ఎన్నికలు లేకపోవడం వల్ల ప్రజలు నష్టపోతున్నారని, సంక్షేమం కుంటు పడుతుందన్నారు. 1950 చట్టం ప్రకారం అప్పటి సరిహద్దులు విలేజ్ రామకృష్ణాపూర్, ఊరు మందమర్రిని పక్కన పెట్టి ఎన్నికలు నిర్వహించవచ్చని తెలిపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఎన్నికలు లేకపోవడం వల్ల అధికారుల జవాబుదారితనం లోపించిందన్నారు. దశాబ్దన్నర కాలంగా ప్రజలు డిమాండ్ చేస్తున్నారన్నారు. ఎన్నికలే ఎజెండగా అఖిల పక్ష కార్యాచ రణ ఉంటుందని, సమావేశాలు ఏర్పాటు చేసి పరిస్థితిని వివరించనున్నట్లు తెలిపారు. నాయకులు సంపత్, రాజశేఖర్, సూరిబాబు, శంకర్, రాజశేఖర్, మాయ రమేష్, ముల్కల్ల ప్రసాద్, వెంకటేశ్వర్లు, సురేష్, తదితరులు పాల్గొన్నారు.





### స్థానిక ఎన్నికల్లో గెలుపే

## లక్ష్యంగా పని చేయాలి

కౌటాల, జనవరి 18 (ప్రభాత సమాచారం)
రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. శనివారం కౌటాల మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడు తూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో సిర్పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ సత్తా చాటాలన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కౌటాల వారసంతలో ప్రజల సౌకర్యార్థం రూ.3.5 లక్షలనిధులతో మూత్రశాలల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు బసర్కార్ విశ్వనాథ్, దుబ్బుల నానయ్య, టీపీసీసీ సభ్యులు అర్షద్ హుస్సేన్, నాయకులు ఉమా మహేశ్, తిరుపతి, రవీందర్ గౌడ్, డబ్బా బాపు, ఖాళీం పాషా, గట్టయ్య, బండు, గోపాల్ పాల్గొన్నారు.

### మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

## దరఖాస్తు గడువు పొడిగింపు

మంచిర్యాల, జనవరి 18 (ప్రభాత సమాచారం)
పోటీ పరీక్షలకు సన్నద్ధం అయ్యే నిరుద్యోగ యువతకు ఉచిత ఫౌండేషన్ శిక్షణ అందించడం కొరకు అభ్యర్థుల దరఖాస్తు గడువును ఫిబ్రవరి 15వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్-1, 2, 3, 4, కేంద్ర ప్రభుత్వ స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్, బ్యాంకింగ్ తదితర పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న మైనారిటీ అభ్యర్థులకు అనుభవజ్ఞులైన శిక్షకులతో 4 నెలల ఉచిత ఫౌండేషన్ శిక్షణ అందించడం జరుగుతుందని, అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి గల మైనారిటీ అభ్యర్థులు తమ దరఖాస్తుతో అవసరమైన ధృవపత్రాలు జతపరిచి ఫిబ్ర వరి 15వ తేదీలోగా జిల్లాలోని నస్పూర్ గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో మొదటి అంతస్తు ఎఫ్-5లో మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో పని వేళల యందు అందించాలని తెలిపారు.

# నిరుపేద కుటుంబానికి నిత్యావసర సరకులు పంపిణీ

ఇంద్రవెల్లి, జనవరి 18 (ప్రభాత సమాచారం)
మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన ఆత్రం మారుతీ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న హైమన్ డార్ప్ బెట్టి ఎలిజీబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దుర్వ సంతోష్ అయన కుటుంబాన్ని పరామర్శించారు.మృతి పట్ల ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆత్రం మారుతీ కుటుంబ సభ్యులకు నిత్యావసర సరకులతో పాటు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా హైమన్ డార్ప్ – బెట్టి ఎలిజీబెత్ స్మారక గ్రంథాలయ వ్యవస్థాపక అధ్యక్షుడు దుర్వ సంతోష్ మాట్లాడుతూ. నిరుపేదలకు నిస్సాయ స్థితిలో ఉన్న వారికీ తమ స్వచ్ఛంద సంస్థ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. సేవే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.సమాజ హితం కోసం తామెల్లప్పుడు ముందుటామని అన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ గౌడ్, నాని గౌడ్,మడవి తెలంగరావు, మడవి భీంరావు, తదితరులు పాల్గొన్నారు.





## నూతన తహసీల్దార్ భవన నిర్మాణ స్థల పరిశీలన

**కుభీర్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

మండల కేంద్రమైన కుబీర్ తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు తహసీల్దార్ భవనం లేకపోవడంతో అధికారులు తీవ్ర ఇబ్బందులు ఎదురుకోవడంతో ముధోల్ ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్ ఆదేశాను సారంగా శనివారం ఆర్అండ్బీ ఈఈ సునీల్ బాబు, బీజేపీ మండల నాయకులు కలసి తహసీల్దార్ భావన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షడు ఏశాల దత్తాత్రి మాట్లాడుతూ ఎన్నో ఏండ్ల నుంచి మండల కేంద్రంలో తహసీల్దార్ భవనం లేకపోవడంతో మండల ప్రజలు, అధికారులు ఎన్నో ఇబ్బందులు కావడం జరిగింది. దింతో ఎమ్మాల్యే రామారావు పటేల్ చోరువా చూపి మండలంలో నూతన తహసీల్దార్ భవనాన్ని మంజూరు చేసేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. దీంతో నూతన భవనం స్థలం పరిశీలించడం తో మండల వసూలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్ సాయినాథ్ రమేష్ గంగా శేఖర్ మండల ప్రజలు తదితరులు ఉన్నారు.

## రైతుల సంక్షేమమే భారత్ కిషన్ సంఘం ధ్యేయం

**ముథోల్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

రైతుల సంక్షేమమే భారత కిషన్ సంఘం ద్యేయం అని భారతీయ కిసాన్ రాష్ట్ర సంగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంబిర్ ఆనంద్ రావు అన్నారు.శనివారం ముధోల్ మండల కేంద్రంలోని మహాలక్ష్మి వీధిలోని పంచముఖి హనుమాన్ ఆలయంలో శనివారం భారతీయ కిసాన్ రాష్ట్ర సంఘ్ ఆధ్వర్యంలో ముధోల్ గ్రామ రైతులకు కిసాన్ సంఘ్ ఏర్పాటు ఆవశ్యకతను అవగాహన కల్పించారు. కిసాన్ సంఘ్ రైతుల సమస్యలకు పరిష్కారం మార్గాలను సూచించారు. పంటల ధరలు పడిపోవడం, సాగు నీటి కొరత, రుణభారం, విద్యుత్ సరఫరా లో జాప్యం, విత్తనాలు, ఎరువుల లభ్యత వంటి సమస్యలను గుర్తించి, వాటకి పరిష్కార మార్గాలను కనుగొనాలని ముధోల్ తాజా మాజీ ఎంపీటీసీ దేవుజి భూమేష్ అన్నారు. రైతులను యువ రైతుల ఉద్దేశించి మాట్లాడారు అనంతరం ముధోల్ తాజా మాజీ సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్ మాట్లాడుతూ రైతుల సామూహిక శక్తిని ఒకే వేదికపైకి తెచ్చి, వారి సమస్యలని గుర్తించి వాటికి పరిష్కారం కనుగొనేందుకు ఏర్పాటు చేయబడిన ఒక సంస్థ. భారతదేశం వంటి వ్యవసాయాధారిత దేశంలో రైతు సంఘాలు రైతుల జీవితాలను మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని, వ్యవసాయ రంగంలో స్థిరత్వం, అభివృద్ధి కోసం రైతు సంఘాలను ఏర్పరచి, వాటిని బలోపేతం చేయడం అత్యంత అవసరం. యువ రైతులు ఉత్సహముగా ముందరికి వచ్చి ఈ రైతు సంఘము ముధోల్ ఏర్పాటులో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నిజాంబాద్ జిల్లా భారతీయ కిసాన్ సంఘ అధ్యక్షులు సాయి రెడ్డి, మాజీ సర్పంచ్ రాజేందర్, మాజీ ఎంపీటీసీ భూమేష్, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు తాటివార్ రమేష్, పిఎసిఎస్ డైరెక్టర్ గోపి పటేల్, రైతులు సాయిప్రసాద్ జంబుల, రమాకాంత్ పాటిల్, యోగేశ్ పాటిల్, గంగాధర్ పటేల్, మేకల సాయినాథ్ యాదవ్, కందోళ్ళ శంకర్, సారథి రాంకీ, స్వామి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## టెన్త్ విద్యార్థుల తల్లిదండ్రులతో ఆదిలాబాద్ కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్



**ఆదిలాబాద్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

పదవ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో జిల్లా కలెక్టర్ రాజర్షి షా శనివారం ఆయన కార్యాలయం నుండి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించేందుకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించాలంటే వచ్చే నెలన్నర రోజులు తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధవహించి , చదువు పైనే దృష్టిసారించేలా చూడాలని అన్నారు. ఉదయం 5 గంటలకు నిద్ర లేపి చదువుకోవాలని చెప్పాలని, పరీక్షలు అయ్యేంతవరకు వేరే పని చెప్పకూడదని, ఇంట్లో పనులు, వేరే ఇతర పనులు చెప్పకుండా కేవలం చదువు పైనే దృష్టి కేంద్రీకరించేలా చూడాలని, సూచించారు. అలాగే టీవీ, మొబైల్ చూడనివ్వకూడదని తెలిపారు. విద్యార్థులు ఇంట్లో ఎలాంటి ఒత్తిడికి లోను కాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని, దీనివల్ల ప్రశాంతంగా చదువుకొని పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించి బాసర ఐఐటిలో సీట్లు సాధించవచ్చని, భవిష్యత్తులో మంచి ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు. అందుకు తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ మీ పాప, బాబు ఎలా చదువుతున్నారు ? బాగా చదువుతారా ? ఇంట్లో ఎలా ఉంటారు ? తదితర విషయాలు కలెక్టర్ అడిగి తెలుసుకొని విద్యార్థులు బాగా చదివేందుకు మీ వంతు సహాయ సహకారాలను అందించాలని కోరారు. పదవతరగతి విద్యార్థుల వివరాలు, సిలబస్ వివరాలు, వేకప్ కాల్స్ కు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా తాను ఉదయం 5 గంటలకు లేచి 7 గంటల వరకు చదివి పాఠశాలకు వెళ్లేదని క్రమబద్ధంగా పాఠ్యాంశాలను నేర్చుకొని ఈ రోజు మీ ముందు జిల్లా కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్నానని, దీనికి తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతగానో కలెక్టర్ ఉందన్నారు. ప్రణాళిక బద్ధంగా చదివించాలని పదవతరగతి లో మంచి ఫలితాలు సాధించి బాసర ఐఐటి కళాశాలలో సీట్లు సంపాదించాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల పనితీరును కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి ప్రణీత, డీసీబీ సెక్రటరీ గజేందర్, ఆరోగ్య పాఠశాల అనుసంధాన కర్త అజయ్, విద్యార్థులు తల్లిందండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన సివిల్ కానిస్టేబుల్ సిబ్బందికి శిక్షణ పూర్తి

**ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్ ఆలం**



**ఆదిలాబాద్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

జిల్లాకు నూతనంగా విచ్చేసిన కానిస్టేబుల్‌లకు వారానికి ఒకరోజు చొప్పున ఐదు వారాలపాటు సిబ్బందికి వివిధ అంశాలలో నిష్ణాతులైన సిబ్బంది చేత పోలీస్ స్టేషన్ విధులు, ప్రస్తుత పోలీస్ విధి విధానాలు అంశాలపై శిక్షణను అందించినట్లు జిల్లా ఎస్పీ గౌష్ ఆలం తెలిపారు. డిసెంబర్ 20వ తారీఖున ప్రారంభమై మూడు బ్యాచులుగా విభజించి వారానికి మూడు రోజులపాటు శిక్షణను తీసుకొని నిష్ణాతులైన నూతన 145 సివిల్ కానిస్టేబుల్ సిబ్బంది. ఈ శిక్షణలో భాగంగా సిబ్బంది కోర్టు డ్యూటీ విధులు, రిసెప్షన్ విధులు, పిటీషన్ మేనేజ్మెంట్ విధులు, బ్లూ కోర్ట్, డయల్ 100, పెట్రోలింగ్, బిట్ సిస్టం, అనుమానితులను పరిశీలించడం, నేర నియంత్రణ, నేర పరిశోధన, సి సి టి ఎన్ ఎస్, సైబర్ క్రైమ్, సిఈఐఆర్, ముఖ్యంగా ప్రమాదాల సమయంలో ప్రజలను కాపాడేందుకు ఉపయోగపడే సిపిఆర్ పద్ధతిని సిబ్బందికి పూర్తి అవగాహనను కల్పించడం జరిగిందని తెలిపారు. శనివారం పోలీస్ కార్యాలయంలో ముగింపు కార్యక్రమంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. నేర పరిశోధనలో సాక్షాదారాలు ముఖ్యమైనవి తెలిపారు. కోర్టులో నేరం నిరూపించేందుకు సాక్షదారాలను పరిరక్షిస్తూ పరిశోధన చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్కు వచ్చి ఫిర్యాదు దారుల పట్ల న్యాయంతో వ్యవహరిస్తూ తక్షణమే సిబ్బందిని కేటాయించి సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు. ముఖ్యంగా సమాజంలో బీదస్థుల పట్ల, వెనుకబడిన తరగతులు వారి పట్ల, ఆదివాసుల పట్ల గౌరవంగా వ్యవహరిస్తూ న్యాయం చేకూర్చే విధంగా చర్యలను తీసుకొని ప్రజలకు పోలీసుల పట్ల ఉన్న గౌరవాన్ని కీర్తిని పెంపొందించే దిశగా కృషి చేయాలని సూచించారు. న్యాయం ప్రతి ఒక్కరికి సమానమే అనే అంశాన్ని ప్రతి ఒక్కరూ మనసులో ఉంచుకుని విధులను నిర్వర్తించాలని సూచించారు. అదేవిధంగా పోలీసు విధులను కమ్యూనికేషన్ వ్యవస్థ కీలకమైనది వాటిని ఉపయోగించే విధానాన్ని నేర్చుకొని అమలుపరచాలని సూచించారు. పోలీసులలో ముఖ్యంగా శారీరక మరియు మానసిక ఒత్తిడిలకు గురికాకుండా ప్రశాంతమైన వాతావరణంలో ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొనే విధంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా శిక్షణను అందించి తమ వంతు పాత్ర కీలకంగా పోషించిన మరియు కోర్టు విధులు న్యాయపరంగా వచ్చే సమస్యలపై వివరించిన మాజీ పీపి రమణారెడ్డి, ఫిజికల్ మేనేజ్మెంట్పై శిక్షణ అందించిన పురుషోత్తం రెడ్డి, సుధీర్ రెడ్డిలను శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ శిక్షణ ను పూర్తి చేయడంలో కీలకపాత్ర పోషించిన డబ్ల్యూపిఎస్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ మరియు రిజర్వ్ ఇన్స్పెక్టర్ డి వెంకట్ ని జిల్లా ఎస్పీ అభినందించారు.

## చప్రాడాకు మహాపాదయాత్ర

**బెజ్జూర్ (ఆసిఫాబాద్), జనవరి 18 (ప్రభాత సమాచారం)**



మండలంలోని ఎల్కపల్లి(బీ) అభయాంజనేయస్వామి ఆలయం నుంచి మహా రాష్ట్రలోని చప్రాడాలో గల దత్తవార్ కార్తీకస్వామి మహరాజ్ ఆలయం వరకు 20వ మహా పాదయాత్ర కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, ఎస్పై ప్రవీణ్ కుమార్ శనివారం జెండా ఊపి ప్రారంభించారు. బెజ్జూర్, కుకుడ, బారెగూడ, రుద్రపూర్, చింతలమానెపల్లి, అనుకోడ, రవీంద్రనగర్, తుమ్డిహేటి గ్రామాల మీదుగా సాగిన పాదయాత్రలో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నా రు. భక్తులకు కేశెట్టి శ్రీనివాస్, సామల వెంకటేశం, మాజీ ఎంపీటీసీ సుల్తానా జావీద్ అల్పాహారం అందజేశారు. చక్రీడా ఆలయంలో భక్తులకు సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశా ్బ బు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ స భ్యుడు సుధాకర్రావు, ఎల్కపల్లి ఆలయ కమి టీ అధ్యక్షుడు రామకృష్ణ, కంకాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ కనకయ్య, రంగనాయక ఆలయ కమిటీ చైర్మన్ తంగిడెపల్లి మహేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీవర్ధన్, నిర్వాహకులు భాస్కర్రాజు, పుల్లూరి సతీశ్, సామల తిరుపతి, దిగంబర్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకే సంక్షేమ పథకాలు..

**ఆసిఫాబాద్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**



అర్హులకే సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సూచించారు. జిల్లా కేంద్రంలోని జూబ్లీ మార్కెట్ సమీపంలో రైతు భరోసా పథకంపై నిర్వహిస్తున్న వ్యవసాయ భూముల సర్వేను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యవసాయానికి యోగ్యమయ్యే భూములకు మాత్రమే రైతు భరోసా వర్తింపజేయాలని సూచించారు. పట్టణంలో పలుచోట్ల కూరగాయలు విక్రయిస్తుండటంతో జూబ్లీ మార్కెట్లో వ్యాపారాలు సాగడం లేదని పలువురు వ్యాపారులు కలెక్టర్కు తెలిపారు. దీంతో సంబంధిత అధికారులతో చర్చించి, సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జన్కాపూర్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డుల సర్వే ప్రక్రియను పరిశీలించారు. తహసీల్దార్ రోహిత్ దేశపాండే, వ్యవసాయాధికారి మిలింద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ భుజంగరావు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందించాలి



**నిర్మల్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వం నూతనంగా అమలు చేయబోవు ఇందిరమ్మ ఇండ్లు, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించాలని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, ఉత్తమ్ కుమార్ రెడ్డి లతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, లబ్ధిదారులను గుర్తించేందుకై గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో క్షేత్రస్థాయి సర్వే నిర్వహించాలన్నారు. సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా పథకం వర్తిస్తుందన్నారు. ఇందుకుగాను వ్యవసాయ శాఖ అధికారులు పంటలను సాగు చేసే భూములను గుర్తించి నివేదికలను సిద్ధం చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో గ్రామ సభలు, పట్టణ ప్రాంతాల్లో వార్డు సభలు నిర్వహించి అంతిమ లబ్ధిదారుల వివరాలను వెల్లడించాలన్నారు. ఈ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని తెలిపారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న పథకాల లబ్ధిదారులను పకడ్బందీగా ఎంపిక చేయాలని తెలిపారు. అర్హుల ఎంపికను ఎలాంటి తప్పిదాలు లేకుండా పూర్తి చేయాలని తెలిపారు. ఉన్నతాధికారులందరూ సర్వే తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టరేట్ లోని సమావేశం మందిరం నుంచి జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, జిల్లాలో నిర్వహిస్తున్న నాలుగు పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. ఈనెల 21 నుంచి గ్రామ వార్డు సభలను నిర్వహించి సమగ్ర అంతిమ లబ్ధిదారుల జాబితాను వెల్లడిస్తామని తెలిపారు. నాలుగు పథకాల ఎంపికకు సంబంధించి క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో జరుగుతున్న సర్వేను సమీక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.



## దైవదర్శనానికి వెళుతూ రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తల మృతి

**నిర్మల్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**
కోతులను తప్పించబోయి ప్రమాదవశాత్తు కారు బోల్తా పడి భార్యాభర్తలిద్దరూ మృతి చెందారు. ఈ విషాద ఘటన నిర్మల్ జిల్లాలోని మామడ మండలం బూరుగపల్లి గ్రామం వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది, స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్య ప్రదేశ్ నుంచి శ్రీశైలం వెళ్తున్న కారు రోడ్డుకు అడ్డుగా వచ్చిన కోతిని తప్పించే క్రమంలో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు భార్యాభర్తలు మృతి చెందగా, మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతులు జబల్పూర్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలం దర్శనానికి కుటుంబంతో కలిసి వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తుంది. మృతులు మధ్య ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు.

## సీపీఐ(ఎం) మహాసభల పోస్టర్లు ఆవిష్కరణ




**జన్నారం, జనవరి 18 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండలంలోని పొనకల్ గ్రామపంచాయతీ పరిధిలోని రామాలయం కాలనీలో శనివారం సీపీఐ (ఎం) నాల్గవ రాష్ట్ర మహాసభల పోస్టర్లు ఆ పార్టీ నాయకులు విడుదల చేశారు. అనంతరం పార్టీ మండల కార్యదర్శి కనికరపు అశోక్ మాట్లాడుతూ, తెలంగాణ నాల్గవ రాష్ట్ర మహాసభలు 2025 జనవరి 25 నుండి 28 వరకు, సంగారెడ్డి పట్టణంలో జరుగుతున్నాయని తెలిపారు. సీపీఐ(ఎం) ప్రజల పక్షాన నికరంగా నిలబడే పార్టీ అని, కష్టజీవుల పార్టీ సీపీఐ(ఎం) అని తెలిపారు. కొండగుర్ల లింగన్న జిల్లా కమిటీ సభ్యులు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడి దశాబ్ద కాలం గడిచిన, ప్రజల సమస్యలు మాత్రం తీరడం లేదన్నారు. మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో కూకటి కారు బుచ్చయ్య, అంబటి లక్ష్మను, దాసండ్ల రాజన్న, ఎస్.కె అబ్దుల్లా, పర్ల కనకయ్య, ఒడిపల్లి చంద్రయ్య, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

## నిల్వ చేసిన ఇసుక సీజ్

**ఆదిలాబాద్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**
భీంపూర్ మండలం గుబిడి శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ నలందప్రియ తెలిపారు. గుబిడి శివారులోని పెనగంగ నది వెంట శనివారం సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఇసుక తవ్వకాలు చేపట్టిన ప్రదేశాలను పరిశీలించారు. పెంగ నది ఒడ్డున పంట చేలలో పక్కన అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్లను గుర్తించారు. 11 చోట్ల నిల్వ చేసిన డంప్‌లో 25 ట్రాక్టర్ల మేర నిల్వ ఉన్న ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. వీటి విలువ దాదాపు రూ.60 వేలు ఉంటుందని పేర్కొన్నారు. పెన్‌గంగ నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు.

## ప్రభుత్వ పథకాల అమలుకు పకడ్బందీ చర్యలు



**నిర్మల్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**
నూతన ప్రభుత్వ పథకాల అమలు కోసం క్షేత్రస్థాయిలో పకడ్బందీగా సర్వేను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇండ్లు, నూతన ఆహార భద్రత కార్డులు (రేషన్‌కార్డులు), రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం ఇప్పటికే క్షేత్రస్థాయి సర్వే ప్రారంభమైందని తెలిపారు. శనివారం రాత్రి రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో కలెక్టర్లకు పలు కీలక సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. పథకాల అమలు కోసం సర్వేలో పేర్లు రాని ప్రజలు తమ దరఖాస్తులను అందజేసేందుకై ప్రజా పాలన కేంద్రాలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. పథకాల అమలుపై ఎటువంటి దుష్ప్రచారం చేయరాదన్నారు. పథకాల అమలు పై ప్రజలకు ఎటువంటి సందేహాలు ఉన్న ప్రజాపాలన కేంద్రాల వద్ద అధికారులు నివృత్తి చేస్తారని తెలిపారు. గ్రామీణ స్థాయిలో ప్రత్యేక పర్యవేక్షక బృందాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈనెల 21వ తేదీ నుంచి గ్రామసభలు, వార్డు సభలు నిర్వహించి, పథకాల అమలు పై చర్చించి, ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకుంటామన్నారు. పథకాలపై సర్వే అనేది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. వేరు వేరు పథకాలపై సర్వేకు సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని తెలిపారు. ప్రజలకు ఎటువంటి సందేహాలున్న ఆయా అధికారులను సంప్రదించవచ్చునన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# సర్వేను పకడ్బందీగా చేపట్టాలి



**దండేపల్లి, జనవరి 18 (ప్రభాత సమాచారం)**
సంక్షేమ పథ కాల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని తహసీల్దార్ సంధ్యారాణి సూచించారు. వెల్గనూర్, కన్నెపల్లి, లింగాపూర్ గ్రామాల్లో చేపట్టే రైతుభరోసా, రేషన్‌కార్డుల సర్వేను పరిశీ లించారు. ఆమె మాట్లాడుతూ సాగుకు యోగ్యం కాని భూములను సిబ్బంది క్షేత్రస్థా యిలో సర్వే చేయాలన్నారు. రేషన్‌కార్డులు లేని వారి వివరాలను సేకరించాలన్నారు. డిప్యూటీ తహసల్దార్ విజయ, ఏఈవో, రెవెన్యూ శాఖ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు. రైతుభరోసా, రేషన్‌కార్డుల సర్వేను పకడ్బం దీగా చేపట్టాలని ఆర్డీవో హరికృష్ణ సూచించారు. శనివారం కేతనపల్లి, వేమనపల్లి గ్రామాల్లో జరుగుతున్న సర్వేను పరిశీలిం చారు. ఆర్డీవో మాట్లాడుతూ తప్పులు లేకుండా వివరాలను నమోదు చేయాలని పేర్కొ న్నారు. తహసీల్దార్ రమేష్, ఏఈవో రుక్సార్ సుల్తానా, కార్యదర్శి శ్యామ్ పాల్గొన్నారు. తాండూర్ మండలంలోని నర్సింగాపూర్, నర్సాపూర్‌లో జరుగుతున్న రైతు భరోసా సర్వేను మండల పంచాయతీ అధికారి అని ల్‌కుమార్ పరిశీలించారు. ఆర్వో ఎఫ్ఆర్ పట్టాదారులు కూడా రైతుభరోసాకు అర్హుల న్నారు. భూభారతి (ధరణి) పోర్టల్‌లో నమో దైన వ్యవసాయ యోగ్యమైన భూమి విస్తీర్ణం ఆధారంగా పట్టాదారులకు రైతు భరోసా సహాయం అందిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి జగదీష్ ఉన్నారు. చంద్రవెల్లి, రాంపూర్‌లో అధికారులు సాగుకు యోగ్యం కాని భూముల వివరాలకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి సుష్మ, అసిస్టెంట్ అగ్రికల్చర్ అధికారి శంకర్, కార్యదర్శులు కార్తీక్‌రాజు పాల్గొన్నారు. మందమర్రి మండలం అందుగులపేటలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుభరోసా సర్వే నిర్వహించారు. రైతులు సాగు చేస్తున్న భూముల వివరాలను సేకరించారు. ఏయే సర్వే నెంబర్లలో రైతులు సాగు చేస్తున్నారు, సాగుకు అనుకూలంగా ఉన్నాయా లేదా పరిశీలించి నమోదు చేసు కున్నారు. ఏడీ బానోత్ ప్రసాద్, తహసీల్దార్ సతీష్‌కుమార్, వ్యవసాయాధికారి జ్యోతి ర్మయి, కాంగ్రెస్ మండల ఇన్‌చార్జ్ కడారి జీవన్‌కుమార్, ఏఈవో తిరుపతి, ఆర్ఐ గణపతి, కార్యదర్శి వీరేందర్ పాల్గొన్నారు. భీమారంలో కొత్త రేషన్‌కార్డుల లబ్ధిదారుల సర్వేను నిర్వ హించారు. దరఖాస్తుదారుల ఇండ్లకు వెళ్లి వివరాలను నమోదు చేసుకున్నారు. కార్య దర్శి కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు. కాసిపేటలో రైతు భరోసా, రేషన్‌కార్డుల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని మండల ప్రత్యేకాధికారి సాంబ శివరావు అన్నారు. కొండాపూర్, కోనూరు గ్రామాల్లో సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపిక పకడ్బం దీగా చేపట్టాలన్నారు. ఎంపీవో సఫ్దర్ ఆలీ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, సహా యకులు తిరుపతి, పాల్గొన్నారు.

## ప్రశాంతంగా 'నవోదయ' పరీక్ష



**ఆసిఫాబాద్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో నిర్వహించిన జవహర్ నవోదయ కేంద్రీయ విద్యాలయాల్లో ఆరోతరగతిలో ప్రవేశం కోసం నిర్వహించిన పరీక్ష శనివారం ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష ఉదయం 11.30 గంటలకు ఉండగా విద్యార్థులు గంట ముందుగానే కేంద్రాలకు చేరుకున్నారు. 10.30 గంటలకు విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. జిల్లాలో ఆరు సెంటర్లు ఏర్పాటు చేశారు. ఆసిఫాబాద్లో రెండు, కాగజ్ నగర్లో రెండు, సిర్పూర్ (టీ) సెంటర్లో 1,159 మంది విద్యార్థులకు 805 మంది హజరు కాగా, 354 మంది గైర్హాజరైనట్లు నవోదయ ప్రిన్సిపాల్ పార్వతి తెలిపారు. పరీక్షా కేంద్రాలను జిల్లా పరీక్షల నిర్వహణ అధికారి ఉదయ్ బాబు, ప్రిన్సిపాల్ పార్వతి పర్యవేక్షించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 24 సెంటర్లలో 5,191 మందికి గాను 4,167 మంది హాజరు కాగా 1,024 మంది గైర్హాజరయ్యారు.

## ఎమ్మెల్యే నేతృత్వంలోనే ఇసుక, మట్టి తరలింపు

**మంచిర్యాల, జనవరి 18 (ప్రభాత సమాచారం)**
ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేం సాగర్ రావు నేతృత్వంలోనే జిల్లా కేంద్రంలోని గోదావరినదిలోంచి ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్రావు ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి శనివారం మంచిర్యాలలోని గోదావరి నదిలో మట్టి, ఇసుక కోసం తవ్వగా ఏర్పడిన గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందలాది లారీల్లో అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తున్నా అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. తవ్వకాలతో ఏర్పడిన గుంతల్లో వర్షాకాలంలో నీరు నిలిస్తే ప్రజలకు ప్రాణాపాయం పొంచి ఉందన్నారు. అక్రమ తవ్వకాలపై అధికారులు వెంటనే స్పందించి, తగిన చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్, తదితరులు పాల్గొన్నారు.



# క్షమించండి సార్..



**సైఫ్ అలీఖాన్‌కు క్షమాపణలు చెప్పిన నటి**

బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌కి క్షమాపణలు తెలిపింది నటి ఊర్వశీ రౌతేలా. నేను మీ గురించి ఇలా మాట్లాడినందుకు సిగ్గుపడుతున్నాను అంటూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టింది. సైఫ్ అలీఖాన్ మీద దుండగులు దాడి జరిపిన విషయం తెలిసిందే. గత గురువారం తెల్లవారుజామున ముంబై బాంద్రాలోని ఆయన నివాసంలోకి చొరబడిన దుండగుడు కత్తితో సైఫ్‌పై దాడి చేశాడు. దీంతో ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు సైఫ్. అయితే సైఫ్ ఘటనపై బాలీవుడ్ సినీ ప్రముఖులతో పాటు రాజకీయ నాయకులు స్పందిస్తున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని కోరుకుంటున్నారు. అయితే ఈ విషయంపై నటి ఊర్వశీ రౌతేలా మీడియాతో స్పందిస్తూ.. సైఫ్‌పై దాడి దురదృష్టకరం. నేను ప్రస్తుతం డాకు మహారాజ్ సక్సెస్ మూడ్‌లో ఉన్నాను. ఇప్పట ివరకు రూ.105కోట్లు వసూళ్లు సాధించింది. ఈ సినిమా సక్సెస్ అయినందుకు మా అమ్మ నాకు డైమండ్ రింగ్ గిఫ్ట్‌గా ఇచ్చింది. మా నాన్న రోలెక్స్ వాచ్ గిఫ్ట్‌గా ఇచ్చాడు. అయితే వీటిని ధరించాలంటే ఎవరైన దాడి చేస్తారేమో అని ఇప్పుడు భయమేస్తుంది. అంటూ చెప్పుకొచ్చింది. అయితే రింగ్ ఇచ్చిందంటూ మీడియాకి చూపించడం.. అలాగే ఈ వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారి తీశాయి. సైఫ్ అలీఖాన్ చావు బతుకుల మధ్య ఉంటే నువ్వు ఏం మాట్లాడుతున్నావు అంటూ ఊర్వశీపై నెటిజన్లు దుమ్మెత్తిపోశారు. దీంతో తాజాగా ఈ విషయంపై ఊర్వశీ సైఫ్‌కు క్షమాపణలు తెలిపింది. సైఫ్ సర్ ఈ సందేశం మీకు అందుతుందని ఆశిస్తున్న. మీ గురించి మాట్లాడే క్రమంలో నేను ప్రవర్తించిన తీరుపై నాకు సిగ్గుగా ఉంది. ఈ విషయంలో మీకు క్షమాపణలు తెలుపుతున్నా. ఇంటర్వ్యూ ఇచ్చే టైంలో మీపై జరిగిన దాడి ఎంత సీరియస్ అనేది నాకు పూర్తిగా తెలియదు. నేను ఒక సినిమా సక్సెస్‌లో మూడ్‌లో ఉండి.. ఆ సినిమాకి వచ్చిన గిఫ్ట్‌ల గురించి మాట్లాడాను ఈ విషయంలో సిగ్గుపడుతున్నా అంటూ ఉర్వశీ రాసుకోచ్చింది.



# నటనా ప్రావీణ్యుడు ఎన్టీఆర్



నటనలో ప్రయోగాలు చేసిన నటనా ప్రావీణ్యుడు ఎన్టీఆర్ అని సీనియర్ హీరో, హిందూపూర్ ఎమ్మెల్యే బాలకృష్ణ అన్నారు. తెలుగునాట నందమూరి తారక రామారావు విప్లవాన్ని తీసుకొచ్చారని వెల్లడిరచారు. కష్టజీవుల కన్నీళ్లు, అన్నార్తుల ఆకలి నుంచి టీడీపీ పుట్టిందని చెప్పారు. ఏపీ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు 29వ వర్ధంతి సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ లో సోదరుడు రామకృష్ణతో కలిసి బాలకృష్ణ నిరవాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. పేదలకు ఉపయోగపడే పథకాలను ఎన్టీఆర్ ప్రవేశపెట్టారన్నారు. ఎన్టీఆర్ అంటే నటనకు నిర్వచనమని, నవరసాలకు అలంకారమని చెప్పారు. ఎన్టీఆర్ అంటే ఒక వర్సిటీ అని, జాతికి మార్గదర్శకమన్నారు. అలాంటి మహనీయులకు మరణం ఎప్పటికీ ఉండదని తెలిపారు. ఎన్టీఆర్ ఆశయ సాధనలో అనుక్షణం పనిచేస్తామని.. తెలుగు జాతిని నెంబర్ వన్ చేసేందుకు కంకణబద్ధులై ఉన్నామని తెలుపుతూ.. ఆ యుగపురుషుని వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పిస్తున్నాను అంటూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

**నివాళులర్పించిన జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్ రామ్ నివాళులు అర్పించారు. శనివారం ఉదయం అన్న కల్యాణ్ రామ్‌తో కలిసి హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ ఎన్టీఆర్ ఘాట్‌కు చేరుకున్న ఎన్టీఆర్.. తాత సమాధి వద్ద పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో వారి అభిమానులు ఎన్టీఆర్ ఘాట్‌కు తరలివచ్చారు. కాగా, ఎన్టీఆర్ సతీమణి లక్ష్మి పార్వతి కూడా ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఆయనకు నివాళులర్పించారు. ఇక, సీనియర్ హీరో, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, ఏపీ మంత్రి నారా లోకేశ్ తదితరులు ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళి అర్పించానున్నారు. అదేవిధంగా ఎన్టీఆర్ ట్రస్టు భవన్‌లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు.





# ఒంటరిగా వస్తా..
## కలిసి మాట్లాడుకుందాం :

మంచు ఫ్యామిలీలో గత కొన్ని రోజులుగా ఆస్తుల విషయంలో గొడవలు జరుగుతున్న విషయం తెలిసిందే. సంక్రాంతి సమయంలోనూ మరోసారి కుటుంబ వివాదాలు బయటపడ్డాయి. అయితే ఈ ఘటనకు సంబంధించి ఇద్దరిపై కేసులు కూడా నమోదయ్యాయి. ఇదిలావుంటే నిన్నటి నుంచి మంచు విష్ణు, మంచు మనోజ్‌లు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పరస్పర విమర్శలు గుప్పించుకుంటున్నారు. ఇప్పటికే విష్ణు, మనోజ్‌లు సింహం, కుక్క రిఫరెన్స్‌లు వాడగా.. ఇవి ట్విట్టర్‌లో హాట్ టాపిక్‌గా మారాయి. అయితే తాజాగా మంచు మనోజ్ పెట్టిన కూర్చొని మాట్లాడుకుందాం అనే పోస్ట్ ఒకటి ప్రస్తుతం వైరల్‌గా మారింది. నువ్వు చాలా క్యూట్. మనం కలిసి కూర్చొని మాట్లాడుకుందాం. నాన్న, ఇంట్లోని మహిళలు, ఉద్యోగులు మిగిలిన వాళ్లను పక్కనపెట్టి మనమే చర్చించుకుందాం. ఏం అంటావు.? ఈ మీటింగ్‌కి నేను ఒంటరిగానే వస్తాను అని మాటిస్తున్న. నీకు నచ్చిన వాళ్లను నువ్వు తీసుకురావచ్చు. లేదా మనం మంచి హెల్తీ డిబేట్ పెట్టుకుందాం. నీ కరెంట్‌తీగ అంటూ మనోజ్ రాసుకోచ్చాడు. అయితే ఈ పోస్ట్‌కి ఎవరిని ట్యాగ్ చేయలేదు మనోజ్. కానీ ఇది విష్ణుని ఉద్దేశించి మాత్రమే మనోజ్ పెట్టినట్లు నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. కాగా దీనిపై విష్ణు ఏం అంటాడో చూడాలి.

**రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసిన మంచు మనోజ్**

కుటుంబ వివాదాల నేపథ్యంలో నటుడు మంచు మనోజ్ శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ని కలిశారు. ఆస్తుల విషయంలో నటుడు మోహన్ బాబు ఫ్యామిలీలో గొడవలు జరుగుతున్న విషయం తెలిసిందే. సంక్రాంతి సమయంలోనూ మరోసారి కుటుంబ వివాదాలు బయటపడ్డాయి. ఈ నేపథ్యంలోనే ఒకరిపై మరోకరు ఫిర్యాదులు కూడా ఇచ్చారు. అయితే మనోజ్‌పై తన తండ్రి మంచు మోహన్ బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణలో భాగంగా శనివారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ముందు హాజరయ్యాడు మనోజ్. ఈ విచారణలో ఇటీవల చోటు చేసుకున్న సంఘటనల గురించి మనోజ్ వివరించాడు. జల్‌పల్లిలోని తన నివాసాన్ని కొందరు ఆక్రమించుకున్నారని.. తన ఆస్తుల్లో ఉంటున్న వారిని ఖాళీ చేయించాలని కోరుతూ.. కొన్ని రోజుల క్రితం మోహన్ బాబు జిల్లా మేజిస్ట్రేట్‌ని ఆశ్రయించిన విషయం తెలిసిందే. అయితే మోహన్ బాబు ఫిర్యాదు మేరకు జల్‌పల్లిలో నివాసం ఉంటున్న మనోజ్‌కు కలెక్టర్ నోటీసులు పంపించారు. దీంతో ఈ ఫిర్యాదుకు సంబంధించి కలెక్టర్ ముందు విచారణకు హాజరు అయ్యాడు మనోజ్.

# థమన్ వ్యాఖ్యలపై
## స్పందించిన చిరంజీవి



బాలకృష్ణ డాకు మహరాజ్ సక్సెస్ ఈవెంట్‌లో సంగీత దర్శకుడు ఎస్ ఎస్ థమన్ తెలుగు సినిమా గురించి మాట్లాడుతూ.. ఎమోషనల్ అయ్యాడు. విజయం అనేది ఎంత డబ్బు పెట్టిన దొరకదు. అది వచ్చినప్పుడు ఇచ్చే ఎనర్జీ వేరు. మనం లైఫ్‌లో చాలా ముందుకు పోవడానికి సక్సెస్ చాలా ఉపయోగపడుతుంది. సక్సెస్ లేకపోతే నేను ఫిలిం నగర్‌కి కూడా వెళ్లేవాడిని కాదు. అయితే ఒక సక్సెస్ వచ్చిందని చెప్పడానికి కూడా ఇప్పుడు నిర్మాతలకు చెప్పబుద్ధి కావడం లేదు. అలా చేబితే అతడిపై నెగిటివ్‌గా ట్రోల్ చేయడం.. నెగిటివ్‌గా ట్రెండ్ చేయడం జరుగుతుంది. మీరు చేసే నెగిటివ్ ట్రోల్స్ చేయడం వలన నిర్మాతల జీవితాలు ఎఫెక్ట్ పడుతున్నాయి . విపరీతమైన ట్రోల్స్ వలన బాధగా ఉంది. అయితే ఈ వ్యాఖ్యలపై మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. డియర్ థమన్ నిన్న నువ్వు మాట్లాడిన మాటలు హృదయాల్ని తాకేలా ఉన్నాయి. ఎప్పుడూ సరదాగా మాట్లాడుతూ వుండే నీలో ఇంత ఆవేదన వుండడం నాకు ఒకింత ఆశ్చర్యంగా కూడా అనిపించింది. కానీ మనసు ఎంత కలత చెందితే నువ్వింతగా స్పందించావో అని అనిపించింది. విషయం సినిమా అయినా క్రికెట్ అయినా మరో సామజిక సమస్య అయినా సోషల్ మీడియా వాడుతున్న ప్రతి ఒక్కరు తమ మాటల తాలూకు ప్రభావం ఆ వ్యక్తుల మీద ఎలా వుంటుందని ఆలోచించాలి. మనం పాజిటివ్ గా వుంటే ఆ ఎనర్జీ మన జీవితాలని కూడా అంతే పాజిటివ్ గా ముందుకు నడిపిస్తుంది. గాడ్ బ్లెస్ యూ థమన్ అంటూ చిరు రాసుకోచ్చాడు.

# వైన్ తాగుతూ చిల్ అవుతున్న
## యంగ్ హీరోయిన్

యంగ్ బ్యూటీ ఆషికా రంగనాథ్ 'అమిగోస్' చిత్రంతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చింది. నందమూరి కల్యాణ్ రామ్ హీరోగా నటించిన ఈ చిత్రానికి రాజేంద్రరెడ్డి దర్శకత్వం వహించగా.. 2023 వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. దీంతో మొదటి సినిమాతోనే నటనలో మంచి మార్కులు అందుకున్న ఈ బ్యూటీ.. తర్వాత వరుస ఆఫర్లు అందుకుంటూ ప్రజెంట్ వరుస సినిమాలు చేస్తూ సందడి చేస్తుంది. ఈ క్రమంలోనే ఇటీవల సిద్ధార్థ్ 'మిస్ యూ' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ అమ్మడు.. ప్రస్తుతం రెండు, మూడు ప్రాజెక్టులతో బిజీగా ఉంది. వాటిలో మెగాస్టార్ చిరంజీవి 'విశ్వంభర' ఒకటి. ఇక సినిమా విషయాలు పక్కన పెడితే నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ ఆషిక.. తన సినిమా విశేషాలతో పాటు వ్యక్తిగత విషయాలను కూడా అభిమానులతో పంచుకుంటోంది. ఇందులో భాగంగా.. తాజాగా వెకేషన్‌కు చెక్కేసిన ఈ బ్యూటీ 17 ఫొటోలను షేర్ చేస్తూ.. ఒక్కో ఫొటోకి ఒక్కో క్యాప్షన్ ఇచ్చింది. వాటిలో 10 ఫొటోకు 'మదీరా వైన్ టేస్ట్ చేస్తున్న' అంటూ చెప్పుకొచ్చింది. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతుండగా.. రకరకాలుగా రియాక్ట్ అవుతున్నారు నెటిజన్లు.





# జేసీ ప్రభాకర్ రెడ్డిపై మాధవి లత ఫిర్యాదు



సినిమా రంగంలో ఉన్న మహిళలపై అనుచితంగా మాట్లాడిన టీడీపీ నాయకుడు జేసీ ప్రభాకర్ రెడ్డిపై చర్యలు తీసుకోవాలని సినీ నటి మాధవి లత కోరారు. ఈ మేరకు శనివారం 'మా' అసోసియేషన్ ట్రెజరర్ శివ బాలాజీకి ఫిర్యాదును అందజేశారు. సినీరంగంలోని మహిళలపై జరుగుతున్న వ్యక్తిత్వ హననం చేస్తూ సినిమా వారిపై ఆరోపణలు చేయడం కరెక్టు కాదంటూ పేర్కొన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డిపై ఫిల్మ్ ఛాంబర్‌తో పాటు మానవహక్కుల సంఘానికి, పోలీసులకు, ఫిల్మ్ ఇండస్ట్రీకి ఫిర్యాదు చేశాను. ఎవరూ స్పందించలేదు. అందుకే 'మా' కు ఫిర్యాదు చేశానని పేర్కొన్నారు. న్యాయం కోసం పోరాడుతానంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

# మర్మవయవాలపై కొట్టి చంపేశారు

■ నిర్మల్ రూరల్ మండలం చిట్యాల గ్రామంలో దారుణం ■ 12 ఏళ్ల బాలుడి దారుణ హత్య
■ ఘటనను సీరియస్‌గా తీసుకున్న జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ■ ఘటనా స్థలం పరిశీలన..
■ ఆధారాలు సేకరిస్తున్న క్లూసం, డాగ్ స్క్వాడ్ టీం ■ కన్నీటి పర్యంతమైన తల్లి ■ గ్రామంలో విషాద ఛాయలు



నిర్మల్, జనవరి 18 (ప్రభాత సమాచారం)

ఆబాలుడి తండ్రి నాలుగేళ్ల క్రితం మరణించాడు. తల్లి భూదేవి కూలీ పనులు చేస్తూ కొడుకును పోషిస్తోంది. బాలుడు కూడా తల్లికి చేదోడుగా ఉండేందుకు సెలవు రోజుల్లో పనులు చేస్తున్నాడు. సంక్రాంతి సెలవులు నేపథ్యంలో గ్రామ శివారులోని కల్లు బట్టీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. శనివారం వేకువజామున బహిర్భూమికి వెళ్లిన గ్రామస్తులు గమనించి తల్లికి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్పీ జానకీ షర్మిల కథనం ప్రకారం.. నిర్మల్ రూరల్ మండలం చిట్యాల గ్రామానికి చెందిన అడిగెల రిషి అలియాస్ ప్రశాంత్ (12) గ్రామ శివారులోని కల్లు బట్టీలో పనిచేస్తున్నాడు. రోజులాగానే శుక్రవారం పనికి వెళ్లాడు. రాత్రి పొద్దుపోయే వరకు అక్కడే పనిచేశాడు. రాత్రి ఇంటికి రాలేదు. కొడుకు కోసం ఎదురుచూసిన తల్లి దుకాణంలోనే పడుకుని ఉంటాడని భావించింది. కానీ, శనివారం వేకువజామున గ్రామస్తులు ఆమెకు షాకింగ్ వార్త చెప్పారు. రిషి గ్రామ శివారులో హత్యకు గురయ్యాడని తెలిపారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. తల్లి గుండెలు బాదుకుంటూ ఘటనస్థలికి చేరుకుంది. ఇంతలోనే పోలీసులు కూడా అక్కడకు వచ్చారు. ఎస్పీ జానకీ షర్మిల ఘటన స్థలాన్ని పరిశీలించారు. బాలుడి మర్మాంగాలపై బండరాళ్లతో కొట్టినట్లు ఆనవాళ్లు ఉన్నాయి. ఎస్పీ బాలుడి తల్లితో మాట్లాడారు. తన కొడుకు అమాయకుడని, ఎవరో చంపేశారని బోరున విలపించింది. అనంతరం డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. ఘటన స్థలంలో వేలి ముద్రలు కూడా సేకరించారు. డాగ్ స్క్వాడ్ గ్రామంలోని ఓ ఇంటి ముందు ఆగింది. దీంతో పోలీసులు ఆ ఇంట్లోని వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. మరోవైపు గ్రామ శివారులోని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, నిందితులను త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. ఎస్పీ వెంట ఏఎస్పీ రాజేశ్మీనా, రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై లింబాద్రి ఉన్నారు.



# చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

ఆదిలాబాద్, జనవరి 18 (ప్రభాత సమాచారం)




చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తు వాగులో పడి మృతిచెందాడు. జైనథ్ మండలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. జైనథ్ ఎస్సై పురుషోత్తం కథనం ప్రకారం.. మండలంలోని రామాయి గ్రామానికి చెందిన టాప్రే అనిల్ (39) చేపల వేట కోసం శుక్రవారం సాయంత్రం పార్డి(కె), రామాయి గ్రామాల సమీపంలోని సాత్నాల వాగు వద్దకు వెళ్లాడు. చేపల కోసం వేసిన వలలో చిక్కుకుని పార్డి(కె) సమీపంలోని వాగులో పడి మృతిచెందాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు ఆయన కోసం వెతికిన ఆచూకీ దొరకలేదు. శనివారం ఉదయం వాగులో శవమై తేలాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

## నూతన టెక్నాలజీతో
# నేరాలకు అడ్డుకట్ట

నిర్మల్, జనవరి 18 (ప్రభాత సమాచారం)

నూతన టెక్నాలజీలతో నేరాలకు అడ్డుకట్ట వేయడానికి ఫోన్లు దోహదపడతాయని జిల్లా ఎస్పీ జానకీషర్మిల అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్ కార్యాలయంలో డీజీపీ తెలంగాణ ద్వారా ఆమోదించబడిన ఈ సాక్ష(అడ్వాన్స్ - ఇన్వెస్టిగేషన్) యాప్ కోసం రెండు మొబైల్ ఫోన్లు, 128 జీబీ మైక్రో ఎస్డీ కార్డ్లను జిల్లాలోని ప్రతీ పోలీస్టేషన్కు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఈ మొబైల్ ఫొన్‌లోని సాక్షయాప్లో నేరానికి సంబంధించిన సాక్ష్యాలు చెదిరిపోకుండా భద్రంగా ఉంటాయన్నారు. నేరాలకు సంబంధించిన వివరాలను తేదీల వారీగా ఫొటో గ్రఫీ, వీడియోగ్రఫీ రికార్డు చేసి పొందుపరచడం జరుగు తుందన్నారు. దీంతో నేరస్తులకు శిక్షలు పడే అవ కాశం ఉంటుందని పేర్కొన్నారు. నూతన సాంకేతిక టెక్నాలజీ వినియోగంలో నిర్మల్ పోలీసులు దూసుకెళ్తున్నారన్నారు. కార్యక్రమంలో నిర్మల్ ఏఎస్పీ ఉపేంద్రారెడ్డి, అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.




# ఇందాపూర్ వాగు దాటుతుండగా నీట మునిగిన వ్యక్తి

కెరెమరి, జనవరి 18 (ప్రభాత సమాచారం)



దైవదర్శనానికి వచ్చి ఒకరు కానరాని లోకాలకు వెళ్లిపోయాడు. మండలంలోని ఇందాపూర్ వాగు దాటుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. ఇందాపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. కెరమెరి ఎస్సై విజయ్ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని దేవాడ గ్రామానికి చెందిన కోట్నాక మారు (30) ఈనెల 16న ఇందాపూర్ సమీపంలో పోతురాజు, ధర్మరాజు జాతరకు వచ్చాడు. 17 వరకు ఇంటికి తిరిగి వెళ్లలేదు. దీంతో తండ్రి దౌలత్ రావు బంధువుల వద్ద వాకబు చేయగా కుమారుడు ఆచూకీ దొరకలేదు. అదేరోజు కెరమెరి పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో ఇందాపూర్ వాగులో మృతదేహం కనిపించినట్లు పలువురు పోలీసులకు సమాచారం అందించారు. శనివారం వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతుడు కోట్నాక మారుదని గుర్తించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# ప్రశాంతంగా 'నవోదయ' ప్రవేశ పరీక్ష



నిర్మల్, జనవరి 18 (ప్రభాత సమాచారం)

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం శనివారం నిర్వహించిన పరీక్ష జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. జిల్లావ్యాప్తంగా 6 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు పరీక్ష నిర్వహించారు. విద్యార్థులను గంట ముందుగానే కేంద్రాల్లోకి అనుమతించారు. జిల్లా కేంద్రంలో 2 పరీక్ష కేంద్రాలు భైంసాలో 3, ఖానాపూర్లో ఒక పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,479 మంది విద్యార్థులకు 1,310 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 169 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో జరిగే పరీక్షను డీఈవో రామారావు, విజయ హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని జిల్లా పరీక్షల సహాయ అధికారి సిద్ధ పద్మ తనిఖీ చేశారు.

# నాటుసారా స్థావరంపై దాడులు

బెజ్జూర్, జనవరి 18 (ప్రభాత సమాచారం)

లంబాడిగూడ, సలుగుపల్లి, రెబ్బెన గ్రామాల్లోని నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. 40 లీటర్ల నాటుసారా, 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 14 మందిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నాటుసారా తయారీ చేస్తున్న వారిని తహసీల్దార్ భూమేశ్వర్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై ప్రవీణ్ కుమార్, ఎక్సైజ్ ఎస్సైలు లోబానంద్, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



# చెన్నూరు పట్టణ అభివృద్ధికి ప్రత్యేక నిధులు

చెన్నూరు, జనవరి 18 (ప్రభాత సమాచారం)

చెన్నూరు పట్టణ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు ఎమ్మెల్యే వివేక్ అన్నారు. శనివారం రాత్రి మున్సిపల్ కార్యాల యంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పట్టణం గతంలో ఎలాంటి అభివృద్ధి నోచుకోలేదన్నారు. పదేళ్ళ క్రితం తాను ఎంపీగా ఉన్న సమయంలో పట్టణం ఎలా ఉం దేదో ఇప్పుడు అలానే ఉందన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి కాలనీలను సందర్శించి సమస్యలకు ప్రతిపాదనలను తయారు చేస్తున్నా నన్నారు. డీఎంఎఫ్టీ నిధులతో కాలనీల్లో అభివృద్ధి పనులు 70 శాతం వరకు పూర్తయ్యాయన్నారు. పట్టణ అభివృద్ధికి మున్సిపల్ శాఖ చీఫ్ సెక్రటరీతో మాట్లాడి ప్రత్యేక నిధుల మంజూరుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకున్న వారికి రేషన్ కార్డు వస్తుందన్నారు. అర్హులైన వారందరికి రేషన్‌కార్డులు ఇప్పిస్తానన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం జరగనుంది. చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ హాజరు కానున్నారు. ఇందులో అభివృద్ధి పను లపై చర్చించనున్నారు.



అమృత్ స్కీం కింద మందమర్రి, క్యాతన్‌పల్లిలలో చేపట్టిన నీటి పథకం పనుల గురించి ఆరా తీయనున్నారు. అలాగే మందమర్రిలో విద్యా వ్యాప్తికి కృషి చేసిన విద్యా విహార్ విద్యా సంస్థ నిర్వాహకుడు దివంగత షౌకత్ ఆలీ పేరిట రామన్ కాలనీ వద్ద లైబ్రరీని ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్యే వివేక్ హాజరుకానున్నారు.

# బ్యాంకర్ల వేధింపులకు రైతు బలి!

పురుగుల మందుతాగి ఆదిలాబాద్ ఐసీఐసీఐ బ్యాంక్‌లో రైతు సూసైడ్



**బేల, జనవరి 18 (ప్రభాత సమాచారం)**
బ్యాంకు అధికారుల వేధింపుల కారణంగా ఓ రైతు పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలో కలకలం రేపింది. వాయిదా చెల్లింపులో జరిగిన జాప్యానికి బ్యాంకు అధికారులు వేధింపులకు గురి చేశారన్న ఆవేదనతో బ్యాంకులోనే అధికారుల ఎదుటే పురుగుల మందు తాగి కుప్పకూలాడు. కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేల మండలం రేణిగూడ గ్రామానికి చెందిన జాదవ్ దేవ్ రావ్ (60) అనే రైతు పట్టణంలోని టీచర్స్ కాలనీలో గల ఉన్న ఐసీఐసీఐ బ్యాంకు నుంచి తన భూమిని మార్టిగేజ్ చేయించి గత నాలుగేళ్ల క్రితం మూడున్నర లక్షల రుణాన్ని తీసుకున్నాడు. అప్పటి నుంచి క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తూ వస్తున్నాడు. ఇటీవల వాయిదాగా చెల్లించాల్సిన 25 వేలను అనివార్య కారణాలతో సకాలంలో చెల్లించలేకపోయాడు. బ్యాంకు అధికారులు గ్రామానికి వెళ్లి వేధించినట్లు కుటుంబీకులు ఆరోపించారు. శనివారం బ్యాంకుకు వచ్చిన దేవ్‌రావ్ తొలుత మేనేజర్‌ను కలిసి బయటకు వెళ్లిపోయాడు. తర్వాత కొద్ది సేపటికి పురుగుల మందు డబ్బాతో బ్యాంకుకు చేరుకుని వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగి అక్కడే కూర్చున్నాడు. ఇది గమనించిన సెక్యూరిటీ, ఇతర సిబ్బంది ఆయనను ఆసుపత్రికి తరలించడంలో తాత్సారం చేయడంతో అక్కడే కుప్పకూలాడు. ఇదంతా అక్కడి సీసీ కెమెరాలో నిక్షిప్తమైంది. కాగా బ్యాంకు అధికారుల వేధింపులు, ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసి సకాలంలో ఆస్పత్రికి తరలించడంలో చేసిన నిర్లక్ష్యం కారణంగా రైతు ప్రాణాలు కోల్పోయాడని ఆరోపిస్తూ కుటుంభీకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో బ్యాంకు వద్దకు చేరకుని ఆందోళనకు దిగారు. రాస్తారోకో చేపట్టి న్యాయం చేయాలంటూ నినాదాలతో హోరెత్తించారు. ఆత్మహత్యవిషయం తెలుసుకున్న పోలీసులు మధ్యాహ్నం నుండి బ్యాంక్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాలుగేళ్ల క్రితం భూమిని మార్టిగేజ్ చేయించి మూడున్నర లక్షల రుణాన్ని తీసుకున్నాడని అప్పటి నుంచి క్రమం తప్పకుండా వాయిదాలు చెల్లిస్తూనే ఉన్నాడని రైతు దేవ్ రావ్ అన్న కుమారుడు జాదవ్ కృష్ణ, సోదరుడు జాదవ్ హేమాలాల్ తెలిపారు. ఈ సారి పంట దిగుబడి రాకపోవడంతో ఒక వాయిదా చెల్లింపులో జాప్యం జరిగిందని, ఈ మాత్రానికే బ్యాంకు అధికారులు వేధింపులతో ఒత్తిడికి గురి చేసి ఆత్మహత్యకు కారణమయ్యారని వాపోయారు. తమకు న్యాయం జరగని పక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

**బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి..**
ఈ విషయం తెలిసిన వెంటనే ఎమ్మెల్యే పాయల్ శంకర్ బ్యాంకుకు చేరుకున్నారు. అధికారులు, కుటుంబీకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఒక్క వాయిదా చెల్లింపులో కొంత ఆలస్యమైందని, ఇంత మాత్రానికే రైతు పట్ల బ్యాంకర్లు నిర్దాక్షిణ్యంగా వ్యవహరించడం సమంజసం కాదని ఎమ్మెల్యే అన్నారు. వేల కోట్ల అప్పులను ఎగ్గొట్టే బడా బాబులను ఓ రకంగా.. సామాన్య రైతును మరో రకంగా చూసే దోరణి ఆక్షేపణీయమన్నారు. ఊరికి వెళ్లి అందరికి ముందు బ్యాంకు సిబ్బంది అవమానానికి గురి చేయడంతో ఆత్మగౌరవం దెబ్బతిని రైతు ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. అందరికి అన్న పెట్టే రైతు పట్ల ఇంత నిర్లక్ష్యం సరి కాదన్నారు. ఇందుకు బాధ్యులైన బ్యాంకు అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు.

## రైతు మరణంపై విచారణ చేపట్టిన పోలీసులు

### వివరాలను వెల్లడించిన రూరల్ సిఐ ఫణిదర్

**ఆదిలాబాద్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**
వివరాలలోకి వెళితే బేల మండలం రేణుగుడ గ్రామానికి చెందిన జాదవ్ దేవరావ్ గఅనే వ్యక్తి 2019 సంవత్సరంలో ఐసిఐసిఐ బ్యాంకు అదిలాబాద్‌లో తన ఐదు ఎకరాల పొలాన్ని మాడిగేజ్ చేసి, కిసాన్ క్రెడిట్ మాడిగేజ్ లోన్ 3,40,000 రుణాన్ని తీసుకున్నాడు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి వడ్డీ రుణాన్ని చెల్లించవలసి ఉంటుంది. చివరి వడ్డీ 2024 మే నెలలో చెల్లించడం జరిగింది. అక్టోబర్లో చెల్లించాల్సిన వడ్డీ చెల్లించలేదు. దీనికై బ్యాంక్ అధికారులు ప్రతిసారి ఫోన్ చేయడంతో మనస్థాపానికి చెంది ఆత్మహత్య చేసుకున్నాడని జాదవ్ దేవరావ్ కొడుకు ఆకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన మావాల పోలీసులు ఐసిఐసిఐ బ్యాంకు వెళ్లి అక్కడ బ్యాంక్ మేనేజర్ ను మరియు బ్యాంక్ సిబ్బంది విచారించగా జాదవ్ దేవరావు బ్యాంకులో రుణం తీసుకున్న వాస్తవమేనని అయితే అతనికి వడ్డీ చెల్లించాలని బ్యాంకు నుండి గాని మా సిబ్బంది నుండి గాని ఎలాంటి ఒత్తిడి చేయలేదని, అదేవిధంగా మా యొక్క బ్యాంకు డిఫాల్ట్ లిస్టులో కూడా అతని పేరు లేదని అతని ఇంటికి గాని అతనికి గాని బ్యాంకు వడ్డీ కట్టవలసిందిగా ఏలాంటి వేధింపులకు పాల్పడలేదని తెలిపారు. బ్యాంకులో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు సిసి కెమెరాలను క్షుణ్ణంగా పరిశీలించగా జాదవ్ దేవరావు అనే వ్యక్తి మోనోసిల్ అనే పురుగుల మందు బాటిల్ ను ముందుగానే తీసుకొని వచ్చి బ్యాంకు బయట తాగి, తర్వాత లోపలికి వచ్చి తాగినట్లు రికార్డు అయినది. విచారణలో జాదవ్ దేవరావ బ్యాంక్‌కి వచ్చిన తర్వాత బ్యాంక్ అధికారులతో కానీ అక్కడ సిబ్బందితో మాట్లాడినట్టుగాని, వాగ్వాదం చేసుకున్నట్లు గాని జరగలేదు. ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయని కోణంలో విచారణ చేపట్టిన పోలీసులు అతని భార్య కు కిడ్నీ సమస్య వంటి అనారోగ్య సమస్యలు ఉన్నట్లు తెలిసింది. జాదవ్ దేవరావు కొడుకు ఆకాశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు, పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పచెప్పడం జరిగింది. అయితే ఇప్పటివరకు జరిగిన విచారణలో బ్యాంక్ అధికారుల ఒత్తిడి ఉన్నట్లు తేలలేదు, అయితే ఎందుకు ఆత్మహత్య చేసుకున్నారని కోణంలో పోలీసులు పూర్తి విస్తాయి విచారణ చేపడుతున్నట్లు రూరల్ సీఐ కె. ఫణిదర్ తెలిపారు. పూర్తి విచారణ అనంతరం బ్యాంకు అధికారులపై చేసిన ఆరోపణలు నిజమైతే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని తెలియజేశారు.



## విస్తృతంగా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించాలి

### ఎయిడ్స్ కంట్రోల్ జేడీ రవికుమార్

**భైంసా, జనవరి 18 (ప్రభాత సమాచారం)**
హెచ్ఐవీ నియంత్రణకు అన్ని చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జాయింట్ డైరెక్టర్, సుఖ వ్యాధుల నియంత్రణ నోడల్ అధికారి డాక్టర్ రవికుమార్ ఆదేశించారు. పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో హెచ్ఐవీ/ఎయిడ్స్ నియంత్రణ విభాగాన్ని శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇప్పటివరకు నిర్వహించిన పరీక్షలు, రిపోర్టులు, రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. హెచ్ఐవీ బాధితులను గుర్తించి, సంబంధిత కుటుంబ సభ్యులందరికీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పు చేయించుకోవడంతోపాటు వారికి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించాలన్నారు. పాజిటివ్ వస్తే పుట్టబోయే బిడ్డకు ఎలాంటి చికిత్స అందించాలో వివరించారు. అలాగే విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. క్షయ లక్షణాలు ఉన్నవారిని గుర్తించి నిర్ధారణ పరీక్షల కోసం రెఫర్ చేయాలని తెలిపారు. ఆయనవెంట ప్రోగ్రాం అధికారి బి.నాగరాజు, కౌన్సిలర్లు విలాస్, మహిపాల్, సతీశ్, ల్యాబ్ టెక్నీషియన్లు సుధాకర్, తౌఫిక్ ఉన్నారు.

## గాయపడిన యువకుడు మృతి


**నెన్నెల, జనవరి 18 (ప్రభాత సమాచారం)**
మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన ఏస్కూరి రాజేందర్ (26) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన ఏస్కూరి రాజేందర్, దుర్గం శంకర్ సిరిసిల్ల జిల్లా వేములవాడ శివారులో రైతు నవీన్ మామిడితోటలో పని చేస్తున్నారు. ఈ నెల 14న వేకువజామున రాజేందర్, శంకర్ వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయానికి దర్శనం కోసం వెళ్లారు. భగవంతావు నగర్లో గంజాయి మత్తులో ఉన్న ఐదుగురు యువకులు వీరిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. గాయపడిన వారిని పోలీసులు ఆస్పత్రికి తరలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. చికిత్స పొందుతూ రాజేందర్ మృతిచెందాడు.

## ఒకరి ఆత్మహత్యాయత్నం

**సిర్పూర్ (టి), జనవరి 18 (ప్రభాత సమాచారం)**
దుబ్బగూడ కాలనీకి చెందిన సెండె సంతోష్ శనివారం పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆపస్మారక స్థితిలో దారిలో పడిపోయాడు. తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న రికార్డు అసిస్టెంట్ షేక్ ఖాదర్, అటెండర్ మల్లేస్లు ఇటిక్యాల పహాడ్ గ్రామంలో రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు వెళ్లివస్తుండగా మార్గమధ్యలో సంతోష్ను గమనించారు. బైకెపై సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. మెరుగైన వైద్యం కోసం కాగజ్నగర్లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

## ఉరివేసుకుని బలవన్మరణం

**రామకృష్ణాపూర్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**



ఉరి వేసుకోని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం పట్టణంలోని చోటు చేసుకుంది. సింగరేణి విశ్రాంతి కార్మికుడైన మంచి భీమరాజు (70) స్థానిక జవహర్‌నగర్‌లో నివాసం ఉంటు న్నాడు. కొద్దిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధ పడుతు శనివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

# సాంకేతికత వినియోగంతో చోరీల నివారణ



### రామగుండం సీపీ శ్రీనివాస్

**మంచిర్యాల, జనవరి 18 (ప్రభాత సమాచారం)**
చోరీల నివారణకు ప్రజలు సాంకేతికతను వినియోగించాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం కమిషనరేట్ సమావేశ మందిరంలో చోరీల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతనంగా అందుబాటులోకి వచ్చిన యాంటీథెఫ్ట్ అలారమ్ లాక్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విరివిగా అందుబాటులో ఉందన్నారు. ప్రస్తుతం ప్రజలు చిన్నచిన్న వస్తువుల నుంచి పెద్ద వాటి వరకు ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్ డివైసైనే ఆధార ప డి ఉంటున్నారన్నారు. నిత్యం మన జీవన విధానంలో టెక్నాలజీ ఒక భాగమైందన్నారు. చోరీల నివారణకు ప్రతిఒక్కరూ యాంటీ థెఫ్ట్ అలారమ్ లాకర్ను వినియోగించుకోవాలన్నారు. తలుపులు, కిటికీలకు ఈ అలారం బిగిస్తే దొంగలు తలుపులను టచ్ చేయగానే అలారమ్ భారీ శబ్దంతో మోగుతుందన్నారు. దీంతో దొంగలు భయ భ్రాంతులకు గురై పారిపోయే అవకాశం ఉందన్నారు. దీని విలువ సుమారు రూ. 300 నుంచి రూ. 500 వరకు ఉంటుం దని, ఆన్లైన్లో సైతం దొరుకుతుందన్నారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, సీసీఆర్బీ ఇన్స్పెక్టర్ సతీశ్ పాల్గొన్నారు.



## మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో కంప్యూటర్ల చోరీ

### ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన

**ఖానాపూర్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**
మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో మూడు కం ప్యూటర్లు చోరీ జరిగింది. ఈ ఘటన శనివారం ఆల స్యంగా వెలుగుచూసింది. ఇటీవల పాఠశాలకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో ఇదే అదునుగా భావించిన దొంగలు చొరబడి కంప్యూటర్ ల్యాబ్ తాళం పగులగొట్టారు. రూ.54 వేల విలువ గల మూడు కంప్యూటర్లకు సంబంధించిన సీపీయూలు, మానిటర్లు, యూపీఎస్లు, కీబోర్డు, మౌస్లు ఎత్తుకెళ్లారని హెచ్ఎం నరేంద్రరావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. చోరీ ఘటన విషయం తెలియడంతో సీఐ సైదారావు ఘటన స్థలాన్ని పరిశీలించారు. క్లూ స్టీం సిబ్బందితో విచారణ చేపట్టారు.



## ఉద్యోగ కల్పనలో డీట్ యాప్ ఉపయోగపడుతుంది

### నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్

**నిర్మల్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగ కల్పనలో డీట్‌యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డిజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ ఆఫ్ తెలంగాణ జిల్లా కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నిరుద్యోగ యువకులకు ఉద్యోగ కల్పనకై రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన డీట్ యాప్‌లో కళాశాలల విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకునే విధంగా అధికారులు ప్రోత్సహించాలని తెలిపారు. అధికారులు ఈ యాప్‌పై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. డైట్ యాప్‌లో తమ విద్యార్హతలతో పేరును నమోదు చేసుకోవడం ద్వారా వివిధ ప్రైవేటు కంపెనీలు, పరిశ్రమలు వారికి అవసరమయ్యే ఉద్యోగులను నియమించుకుంటుందని తెలిపారు. నిరక్షరాస్యులు కూడా ఉద్యోగ ఉపాధి అవకాశాల కోసం ఈయాప్‌లో తమ పేరును నమోదు చేసుకోవచ్చునన్నారు. నిరుద్యోగులు ఇచ్చిన సమాచారం క్రోడీకరించుకొని యాప్ లో ఆన్లైన్ రెస్యూమేను పొందుపరుస్తుందని తెలిపారు. ఆ సమాచారం ఆధారంగా కంపెనీలు నిరుద్యోగుల్ని సంప్రదిస్తాయని తెలిపారు. ఇందులో తమ పేర్లను నమోదు చేసుకోవడం ద్వారా నైపుణ్యానికి తగ్గ వేతనం లభిస్తుందన్నారు. పలు కంపెనీలో ఖాళీలను డీట్ యాప్ లో పొందుపరుస్తాయని తెలిపారు. డీట్ యాప్ నిరుద్యోగులకు కంపెనీలకు మధ్య వారధిలా పని చేస్తుందన్నారు. ఈ యాప్ ద్వారా నిరుద్యోగులు పారదర్శకంగా తమ విద్యార్హతకు తగిన ఉద్యోగాన్ని పొందవచ్చు అన్నారు. నిరుద్యోగులకు అప్రెంటిస్, ఇంటర్న్‌షిప్‌ల సమాచారం ఎప్పటికప్పుడు అందిస్తుంది అన్నారు. ఇప్పటివరకు ఈ యాప్ లో నమోదు చేసుకున్న జిల్లా నిరుద్యోగుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఇప్పటివరకు జిల్లాకు చెందిన ప్రజలు అనధికారిక ఏజెంట్ల ద్వారా ఇతర దేశాలకు ఉపాధి కోసం వెళ్ళినట్లయితే వారి వివరాలను వారి కుటుంబ సభ్యులు జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలోని కార్మిక శాఖ కార్యాలయంలో వారి ఆధార్ కార్డుతో రేపటి నుంచి 26వ తేదీ లోపు సంప్రదించి వివరాలు నమోదు చేయించాలని తెలిపారు. ఇతర వివరాలకు 9866072044 నంబరును సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో పరిశ్రమల మేనేజర్ నరసింహారెడ్డి, సిపిఓ జీవరత్నం, మెప్మా పిడి సుభాష్, జిల్లా కార్మిక అధికారి ముత్యం రెడ్డి, డివైఎస్ఓ శ్రీకాంత్ రెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## వ్యాపార లావాదేవీల్లో విభేదాలే దాడికి కారణం

**ఆసిఫాబాద్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

కొమురంభీం జిల్లా ఆసిఫాబాద్ పట్టణంలోని సాయి నగర్‌కు చెందిన మాచర్ల అశోక్‌పై కత్తితో దాడికి పాల్పడిన కాగజ్‌నగర్‌కు చెందిన సురేష్‌ను శనివారం అరెస్టు చేసినట్లు సీఐరవీందర్ తెలిపారు. వ్యాపారలావాదేవీల విషయంలో ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో సురేశ్ అశోక్‌పై దాడి చేశాడన్నారు. అశోక్ తండ్రి చిన్న నాగయ్య ఫిర్యాదుతో సురేష్‌ను అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

## ఎమ్మెల్యేను కలిసిన ఐదు గ్రామాల ప్రజలు

### సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేకు వినతులు

**లోకేశ్వరం, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

రూ. 30 కోట్ల కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న రహదారి అభివృద్ధి పనులు పంచ గుడి వరకు పూర్తయ్యేలా చూడాలని ఐదు గ్రామాల ప్రజలు శనివారం ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ ను ఆయన నివాసంలో కలిసి కోరారు. ముధోల్ నుంచి పంచగుడి వరకు రెండు వరసల రహదారి నిర్మాణం పనులు చేపట్టగా అధికారులు సరైన అంచనా వేయక పోవడంతో ఆ పనులు వాస్తాపూర్ గ్రామం వరకే సంబంధిత కాంట్రాక్టర్ చేపడుతున్నాడని తెలిపారు. మిగతా రోడ్డు పూర్తి అధ్వాన్న స్థితిలో ఉందని ఆ రోడ్డు నిర్మాణం కూడా పూర్తి అయ్యేలా చూడాలని అబ్దుల్లాపూర్, జోహార్ పూర్, వాటోలి, ధర్మోరా, పంచగుడి గ్రామాల ప్రజలు శనివారం ఎమ్మెల్యేను కలిసి విన్నవించారు. అలాగే వాటోలి ఎత్తిపోతల పథకం పైపులైన్ల లీకేజీ కారణంగా పూర్తిస్థాయిలో సాగునీరు అందడం లేదని పైపులైన్ల మరమ్మతులకు నిధులు మంజూరయ్యేలా చూడాలని కోరారు. ధర్మోరా చెరువుకు ఎత్తిపోతల పథకాన్ని అనుసంధానం చేస్తే భూగర్భ జలాలు పెంపొందు తాయని అన్నారు. వెంటనే ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సూచించారు. అదనంగా నిధుల మంజూరు కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బీజేపీ మండల అధ్యక్షులు సాయన్న, మాజీ ఎంపీపీ మంద లింగన్న తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయి పోటీలకు రిఫరీ బోర్డు చైర్మన్ నారాయణరెడ్డి



**ఆసిఫాబాద్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

ఈ నెల 17 నుంచి 21 వరకు మహారాష్ట్రలోని నాగపూర్ జిల్లా నారఖేర్‌లో నిర్వహించనున్న 69వ జూనియర్ నేషనల్ బాల్ బ్యాడ్మింటన్ ఫెడరేషన్ రిఫరీ బోర్డు చైర్మన్ మండలంలోని గోలేటికి చెందిన నారాయణ రెడ్డి వ్యవ హరించనున్నట్లు ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి రాజారావు తెలిపారు. ఈ సందర్భంగా బాల్ బ్యాడ్మింటన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నర్సింగం, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తిరుపతి, షార్ప్‌స్టార్ బాల్ బ్యాడ్మింటన్ అసోషియేషన్ అధ్యక్షుడు మహేందర్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి శంకర్, సెపక్ తక్రా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు భాస్కర్, రామకృష్ణ అభినందించారు.

## 22న ఆదిలాబాద్‌కు మందకృష్ణ రాక




**ఆదిలాబాద్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఈనెల 22న జిల్లాకు రానున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ మాదిగ తెలిపారు. పట్టణంలోని ఎస్టియు భవనంలో నిర్వహించే ఈ సన్నాహక సభకు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని ప్రెస్ క్లబ్ లో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 30 ఏళ్ల పోరాటానికి, సుప్రీంకోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పును అమలు చేసుకోవడం కోసం.. ఎస్సీ వర్గీకరణను ఇంకా అడ్డుకునే ప్రయత్నం చేస్తున్న వర్గీకరణ వ్యతిరేక ద్రోహులకు బుద్ధి చెప్పడం కోసం.. ఫిబ్రవరి 7న హైదరాబాదులో నిర్వహించ తలపెట్టిన వేల గొంతులు, లక్ష డప్పుల భారీ ప్రదర్శన జయప్రదం చేయడం కోసం జిల్లాల వారీగా పర్యటనలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాకు రాబోతున్నారన్నారు. కావున ఈ సభను జయప్రదం చేయడం కోసం జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాలు, మాదిగ మాదిగ ఉపకులాల ప్రజలందరూ, అలాగే ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తున్నటువంటి వర్గీకరణ అనుకూలవాదులు ప్రజాస్వామ్య వాదులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ఈ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ ఉపాధ్యక్షులు గైక్వాడ్ సూర్యకాంత్, సీనియర్ నాయకులు సందూరి, వినయ్, సాగర్, పట్టణ నాయకులు రాజేష్, పెద్దింటి సూర్యప్రసాద్, మురళి, రూరల్ మండలం ఇన్చార్జి తరుడి శంకర్, దీపక్, జై సింగ్ జివారీ పాల్గొన్నారు.

## ఫుట్బాల్ పోటీలకు ఎంపిక

**మంచిర్యాల, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

ఖేలో ఇండియా అండర్-17 బాలికల రాష్ట్రస్థాయి ఫుట్బాల్ పోటీలకు హాజీపూర్ మండలం దొనబండ జెడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని జి.రశ్మిత ఎంపికైౖ ఉంది. గతనెల 21న మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన జిల్లాస్థాయి ఫుట్బాల్ పోటీల్లో రశ్మిత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై పొందని హెచ్ఎం హన్మాండ్లు, పీఈటీ శ్రీనివాస్ తెలిపారు. సిద్దిపేట జిల్లా వర్గల్లో ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్బాల్ పోటీల్లో ఆమె పాల్గొంటుందని వివరించారు.




## పత్తి కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన

### రోడ్డుపై బైఠాయించి ధర్నా

**ఆసిఫాబాద్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

పత్తి కొనుగోలు చేయాలని డిమాం డ్ చేస్తూ రైతులు శనివారం ఆందోళనకు దిగారు. బాలాజీ జిన్నింగ్ మిల్ సమీపంలోని రోడ్డు పై బైఠా యించి రైతులు ధర్నా నిర్వహించారు, శుక్రవారం బాలాజీ జిన్నింగ్ మిల్ కు 130 పత్తి వాహనాలు వస్తే, 100 వాహనాలను కోనుగోలు చేశారు. మిగతా 30 శనివారం కోనుగోలు చేస్తామని చెప్పడంతో రాత్రి నుంచి తిండి తిప్పలు లేకుండా వేచివున్నమని, కానీ ఇప్పుడు జిన్నింగ్ యాజమాన్యం, అధికారు లు వాహ నాలను లోనికి అనుమతించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు, అధికారులు వ్యవహా రిస్తున్న తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు, జిల్లా అధికారులు స్పందించి తమ పత్తి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.

## ఎన్టీపీసీ కార్మికుల సమ్మె విజయవంతం

### హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యకుడు రియాజ్ అహ్మద్



**జైపూర్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

సింగరేణి అధికారుల కుట్రలను తిప్పకొడుతూ ఎస్టీపీపీలో కాంట్రాక్టు కార్మికులు స్వచ్ఛందంగా విధులు బహిష్కరించి టోకెన్ సమ్మెను విజయవంతం చేశారని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. జైపూర్ ఎస్టీపీపీ భూనిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు ఎన్టీపీసీలో చెల్లిస్తున్న మాదిరిగా వేతనాలతోపాటు డస్టు, రిస్క్, నైట్ డ్యూటీ అలవెన్సులు రూ.5 వేలు చెల్లించడంతోపాటు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ హెచ్ఎంఎస్ ఆధ్వర్యంలో శనివారం ఒకరోజు టోకెన్ సమ్మె చేపట్టారు. సుమారు వెయ్యిమందికి పైగా కార్మికులు పాల్గొని ఎస్టీపీపీ ప్రధాన గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడారు. 2009 భూసేకరణ సమయంలో అధికారులు భూ నిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధి కల్పించి ఏళ్లు గడుస్తోందన్నారు. ప్రతి నాలుగేళ్లకోసారి పదోన్నతి కల్పిస్తూ సెమిస్కిల్డ్, స్కిల్డ్ వేతనాలు చెల్లించాలన్నారు. ప్రభావిత గ్రామాల్లో కాకుండా సీఎస్ఆర్ నిధులను మంత్రుల ఇళ్లల్లో సామగ్రికి, ఇతర ప్రాంతాల్లో ఖర్చు చేస్తోందన్నారు. కార్మిక సమస్యలపై హైదరాబాద్‌లో డిప్యూటీ లేబర్ కమిషన్ ఆధ్వర్యంలో 22 సార్లు చర్చల్లో పాల్గొన్న యాజమాన్యం పట్టించుకోకపోవడంతో సమ్మె చేపట్టినట్లు తెలిపారు. వారి సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కాగా, రాత్రి వరకు కార్మికులు నిరసన వ్యక్తం చేయగా, ఎలాంటి గొడవలు జరగకుండా శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, స్థానిక ఎస్సై శ్రీధర్, సీఐఎస్ఎఫ్, పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. హెచ్ఎంఎస్ ఉపాధ్యక్షుడు సారయ్య, ఎస్టీపీపీ జనరల్ సెక్రెటరీ విక్రమ్, ఉపాధ్యక్షులు చిప్పకుర్తి సంపత్, సాయికృష్ణారెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

## మట్టి లారీ పట్టివేత

**బెల్లంపల్లి, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న లారీ శుక్రవారం రాత్రి పట్టుబడింది. సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కన్నాల శివారులో అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీని రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. రెవెన్యూ అధి కారులు లారీని ఫారెస్ట్ ఆఫీసుకు తరలించకుండ గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సమాచారం తెలిసి ఫారెస్ట్ అధికారులు టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు.

ప్రభాత సమాచారం Digital Edition
తెలంగాణ తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్ ఉమ్మడి
జిల్లా వార్తలు


# మంచిర్యాల ఇక మున్సిపల్ కార్పొరేషన్




- అసెంబ్లీ సమావేశాల్లో చేసిన తీర్మానానికి రాష్ట్ర గవర్నర్ ఆమోదం
- గెజిట్ విడుదల చేసిన ప్రభుత్వ కార్యదర్శి ఆర్. తిరుపతి
- మంచిర్యాల మున్సిపాలిటీతో పాటు పలు గ్రామాలు కార్పొరేషన్‌లో విలీనం
- ఈ నెలాఖరుతో ముగియనున్న మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీకాలం
- గ్రామాల్లో ముగిసిన సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల పదవీకాలం
- కార్యాచరణ రూపొందిస్తున్న సంబంధిత శాఖ అధికారులు

**మంచిర్యాల, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ఆర్ తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. గత నెల 19న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అసెంబ్లీలో మంచిర్యాలను మున్సిపల్ కార్పొ రేషన్‌గా ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీలతోపాటు హాజీపూర్ మండలంలోని ఆరు గ్రామ పంచాయతీలను విలీనం చేస్తూ మంచిర్యాల కేంద్రంగా కార్పొరేషన్ ఏర్పాటుకు కలెక్టర్ కుమార్ దీపక్ మూడు నెలల క్రితం ప్రతిపాదనలు పంపారు. దీనిపై స్పందించిన సీడీఎంఏ కార్పొరేషన్ ఏర్పాటుకు అవసరమైన పూర్తి వివరాలు పంపాలని ఆదేశిస్తూ క్రితం మున్సిపల్ అధికారులకు లేఖ రాసింది. ఈ మేరకు రెండు మున్సిపాలిటీలు, ఆరు గ్రామాల్లో జనాభా, ఓటర్లు, కుటుంబాలు, ఆదాయ వనరులు, తదితర అంశాలపై అధికారులు సర్వే ప్రారంభించారు. సర్వే నివేదిక ప్రభుత్వానికి అందడంతో కార్పొరేషన్‌గా ఏర్పాటు చేస్తూ గెజిట్ విడుదల చేసింది. జనాభా ప్రాతిపదికన మంచిర్యాలను మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా నస్పూర్ మున్సిపాలిటీతోపాటు హాజీపూర్ మండలం లోని వేంపల్లి, కొత్తపల్లి, పోచంపాడ్, ముల్కల్ల, గుడి పేట, చందనాపూర్, నర్సింగాపూర్, నంనూర్ గ్రామాల ను విలీనం చేస్తూ కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్లు గెజిట్‌లో పేర్కొంది. మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలంటే జీవో నెంబర్ 571 ప్రకారం 2.5 నుంచి 3 లక్షల జనాభా అవసరం ఉంటుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం మంచిర్యాల మున్సిపాలిటీలో 36 వార్డు లకుగాను 87,153 మంది జనాభా ఉండగా, నస్పూర్‌లో మున్సిపాలిటీలో 25 వార్డులకు 76,641, అయితే 2021లో అధికారుల గణాంకాల ప్రకారం మంచిర్యాల మున్సిపాలి టీలో లక్షా 50వేలు, నస్పూర్‌లో 91,427, జనాభా ఉంది. అలాగే విలీన గ్రామాల్లో కనీసం 13వేల జనాభా వరకు ఉంటుందని అంచనా. 2022 ప్రకారం చూస్తే రెండు మున్సిపాలిటీలు, విలీన గ్రామాల్లో మొత్తం జనాభా 2,54,000 మంది ఉన్నారు. ఈ మూడేళ్లలో ఆయా స్థానిక సంస్థల పరిధిలో మరింతగా జనాభా పెరగడం, 150 చదరపు కిలో మీటర్ల వైశాల్యం ఉండటంతో మున్సి పల్ కార్పొరేషన్ ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

### నాగోబా జాతర, వసంత పంచమి ఉత్సవాలకు
## మంత్రి కొండా సురేఖకు ఆహ్వానం



**బాసర, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా కేస్లాపూర్‌లో నిర్వహించనున్న నాగోబా జాతరకు, నిర్మల్ జిల్లా బాసరలోని శ్రీ జ్ఞాన సరస్వతి దేవస్థానంలో చేపట్టనున్న వసంత పంచమి ఉత్సవాలకు రావాలని కోరుతూ అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను దేవాదాయ శాఖ ఆహ్వానించింది. ఈ మేరకు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, బాసర ఆలయ ఇన్‌చార్జ్ కార్యనిర్వహణాధికారి నవీన్ కుమార్, సహాయ కార్యనిర్వహణాధికారి ఆర్. సుదర్శన్, వేదపండితులు మంత్రి సురేఖని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. నాగోబా జాతర, వసంత పంచమి ఉత్సవ ఆహ్వాన పత్రికను మంత్రికి అందించి, వేడుకలకు ఆహ్వానించారు. జనవరి 28 నుంచి 31 వరకు నాగోబా జాతరను, ఫిబ్రవరి 1 నుంచి 3 వరకు వసంత పంచమి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో మంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా అర్చకులు ఉత్సవ ఆహ్వాన పత్రికను మంత్రికి చదివి వినిపించారు. వేదపండితులు మంత్రి సురేఖకి అమ్మవారి తీర్థ ప్రసాదాలను, శేషవస్త్రాలను అందించి, వేదాశీర్వచనం చేశారు.

# సినిమా షూటింగ్‌లకు దేశంలోనే తెలంగాణ నంబర్ వన్

### తెలుగు ఫిలిం, టెలివిజన్ డెవలప్మెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నాగబాల సురేశ్ కుమార్




**చెన్నూరు, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

సినిమా, టెలివిజన్ షూటింగ్‌లకు దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో తెలంగాణ రాష్ట్రం ఉందని తెలుగు ఫిలిం, టెలివిజన్ డెవలప్మెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, దర్శకుడు, నిర్మాత నాగబాల సురేశ్ కుమార్ అన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అద్భుతమైన ప్రదేశాలు ఉన్నాయని, ఇక్కడ సినిమా షూటింగ్‌లు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరామన్నారు. బాలీవుడ్ సినిమా షూటింగ్ లు సైతం తెలంగాణలో నిర్వహిస్తున్నారన్నారు. నాగబాల అనే టెలివిజన్ సీరియల్ను ఆదిలాబాద్ జిల్లాలో షూటింగ్ చేశామని గుర్తు చేశారు. మంచిర్యాల జిల్లాలో సైతం అందమైన ప్రదేశాలు ఉన్నాయన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలోని శివ్వారం మొసళ్ల కేంద్రం వద్ద రెండు గుట్టల మధ్య ప్రవహించే గోదావరినది, ఉత్తర దిశగా ప్రవహించే ఉత్తర వాహిని గోదావరి నదులతో పాటు ప్రాణహిత, త్రివేణి సంగమం లాంటి నదులు ఈ ప్రాంతానికి నెలవుగా మారాయన్నారు. రాబోయే రోజుల్లో మంచిర్యాల జిల్లాలో సినిమాలు నిర్మించేందుకు కృషి చేస్తానని ఈ సందర్భంగా అన్నారు. సమావేశంలో కొమ్మెర రాంమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

### సిర్పూర్(టి)రేంజ్ పరిధిలో బర్డ్ వాక్-3
### బర్డ్‌వాక్ ఫెస్టివల్-3ని ప్రారంభించిన
## సబ్ కలెక్టర్, ఏఎస్పీ, ఎఫ్‌డీఓ
### పలు ప్రాంతాల్లో పక్షుల వీక్షణ -15రకాల విదేశీ పక్షుల సందడి
### పాల్గొన్న 30మంది ఔత్సాహిక పక్షి ప్రేమికులు



**పెంచికల్‌పేట, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

అటవీశాఖ ఆధ్వర్యంలో పెంచికలపేట రేంజ్‌లో నిర్వహించిన బర్డ్‌వాక్ ఫెస్టివల్-3లో పాల్గొనేందుకు 30మంది ఔత్సాహిక పక్షిప్రేమికులు శుక్రవారం సాయంత్రం పెంచికల్‌పేటకు చేరుకు న్నారు. రాత్రి ఇక్కడే బసచేశారు. శనివారం ఉదయం సబ్‌కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ఏఎస్పీ చిత్తరంజన్, ఎఫ్‌డీవో బోబడే సుశాంత్ సుకుదేవ్‌తో కలిసి బర్డ్‌వాక్ ఫెస్టివల్-3ను ప్రారంభించారు. ముందుగా ఎల్లూరు బొక్కివాగు ప్రాజెక్టు వద్ద పక్షులను వీక్షించారు. ఈ ప్రాంతంలో సుమారు 35రకాల దేశీ, విదేశీ పక్షులను గుర్తించి తమ తమ కెమెరాలలో బంధించారు. పక్షిప్రేమికులకు ఎఫ్ఆర్వో అనీల్‌కుమార్ వాటి ప్రాముఖ్యతను వివరించారు. 15రకాల విదేశీ పక్షుల ఆగమనం బర్డ్‌వాక్ ఫెస్టివల్‌కే ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇందులో బ్లాక్ డ్రాగన్లో, యుఏషాన్ స్వూన్ బిల్, ఐట్ త్రోటేడ్ కింగ్ ఫిషిర్, కామన్ హెూప్, రివర్ టర్న్, గ్రేహార్న్ బిల్, నార్తర్న్ ఫిన్టెయిల్, స్పాట్ బిల్ డక్స్, బ్లాక్ వింజర్డ్ స్టిల్డ్, రెడ్ వాటర్ లాప్వింగ్, గ్రీన్ బిఈటర్, ఒపెన్‌బిల్ స్టార్క్ మొదలగు విదేశీ పక్షులు ఔత్సాహికులను ఆనందింపజేశాయి. మధ్యాహ్నాం పొడుగు ముక్కు రాబందుల ఆవాసమైన పాలరాపు గుట్ట వద్దకు పయనమయ్యారు. పెద్దవాగు-ప్రాణహిత సంగమ ప్రాంతం ప్రకృతి ప్రేమికులను ఆకట్టుంది. అటవీశాఖ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ డివిజన్‌లోని సిర్పూర్(టి)రేంజ్ పరిధిలో శనివారం బర్డ్‌వాక్ ఫెస్టివల్-3ను ఘనంగా ప్రారంభించారు. వివిధ రకాల దేశ, విదేశీ పక్షులను తమ కెమెరాల్లో బంధించారు. సిర్పూర్(టి)రేంజ్ పరిధిలో చింతకుంట సెక్షన్‌లోని వివిధ కుంటలు, హీరాపూర్‌వాగు, జీడివాగు తదితర ప్రాంతాల్లో పక్షి ప్రేమికులు పర్యటించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో సుశాంత్‌బోబడే, ఎఫ్ఆర్వో ఇక్బాల్ హుస్సేన్, సెక్షన్‌ఆఫీసర్ మోహన్‌రావు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష



**ఆదిలాబాద్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

జవహర్ లాల్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశం కోసం శనివారం జిల్లాలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాతంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా 1170 మంది విద్యార్థుల కోసం ఆదిలాబాద్ పట్టణంలో 3, ఉట్నూర్, ఇచ్చోడలో ఒకటి చొప్పున మొత్తం 5 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 11.30 నుంచి పరీక్ష ప్రారంభం కాగా గంట ముందుగానే విద్యార్తులను కేంద్రాల్లోకి అనుమతించారు. హాల్ టిక్కెట్ తో పాటు ఆధార్ గుర్తింపు కార్డును పరిశీలిస్తూ లోనికి పంపించారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి తరలివచ్చిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కేంద్రాలు సందడిగా మారాయి. మధ్యాహ్నం 1.30 లకు పరీక్ష పూర్తవగా 1170 మంది విద్యార్థులకు గాను.. 962 మంది హాజరయ్యారు. 208 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. డీఈవో ప్రణీత కేంద్రాలను సందర్శించి పరీక్షను పర్యవేక్షించారు.

### గంగాజలంతో ఉట్నూర్‌కు చేరుకున్న
## మెస్రం వంశీయులు

**ఉట్నూర్, జనవరి 18 (ప్రభాత సమాచారం)**

నాగోబా పూజ సమీపిస్తున్న తరుణంలో మెస్రం వంశీయులు గంగా జలాన్ని తీసుకొని తిరుగు ప్రయాణంలో శనివారం ఉట్నూర్‌లోని గోండుగూడ చేరుకున్నారు. మెస్రం వంశీయులు ఉట్నూర్‌కు రాకతో మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్ రావ్, ఆదివాసీలు స్వాగతం పలికారు. సేద తీరాక అనంతరం ఇంద్రవెల్లి కాలినడకన పయనమయ్యారు. 28న నాగోబాకు మహాపూజ అనంతరం జాతర ప్రారంభం కానుంది.

